నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ శుక్రవారం 12-3-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 189 పేజీలు: 4 వెల: రూ.1/-

తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా శివరాత్రి వేడుకలు

శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు
శైవాలయాలకు పోటెత్తిన భక్తులు
నదీతీరాల్లో పుణ్యస్నానాలు..ఆలయాల్లో అభిషేకాలు
వేములవాడలో పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్,మార్చి11(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. శివనామస్వరంతో ఆలయాలన్నీ మార్మోగాయి. వేములవాడ, కాళేశ్వరం, వేయిస్తంభాల గుడి, రామప్ప,శ్రీశైలం, శ్రీకాళహస్తి, కోటప్పకొండ, వేములవాడ, కీసర ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఓం నమశ్శివాయా అనే మంత్రాక్షరితో కీసరగుట్ట దేదీప్యమానంగా వెలిగిపోతోంది. భక్తులు ఓం నమశ్శివాయా అంటూ శివుడిని దర్శించు కుంటున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. భక్తులు ఉదయం నుంచే శివాలయాలకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మంత్రులు ఆయా ఆలయాల్లో పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ తదితరులు స్వామిని దర్శించుకున్నారు. శివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఓం నమఃశివాయ నామ స్వరణతో భక్తులు శివయ్యను దర్శించుకున్నారు.రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం అర్ధరాత్రి నుంచి భక్తులు బారులు తీరారు. ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేసి భక్తులకు మహాలఘుదర్శనం కల్పిస్తున్నారు. రాజరాజేశ్వర స్వామి వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఏడుపాయల వనదుర్గామాతకు మంత్రి హరీష్ రావు పట్టువస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి కూడా వెంట ఉన్నారు. హన్మకొండ వేయిస్తంభాల గుడిలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో శివరాత్రి శోభ సంతరించుకుంది. శైవక్షుత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వేయిస్తంభాల దేవాలయం, కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం, కురవి వీరభద్రస్వామి, పాలకుర్తి సోమేశ్వర ఆలయాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంది. నల్లగొండ జిల్లాలోని శైవక్షేత్రాల్లో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చెర్వుగట్టు, పానగల్, వాడపల్లి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. నిజామాబాద్ జిల్లాలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. జిల్లాలోని నీలకంఠేశ్వరాలయం, శంభునిగుడి, బోధన్ ఏకచక్రేశ్వరాలయం, ఆర్మూర్ సిద్ధులగుట్ట ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శివనామ స్మరణతో శైవక్షేత్రాలు మార్మోగు తున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో మహా శివరాత్రి సందర్భంగా చెన్నూరు, గూడెం, లక్షెట్టిపేట, మంచిర్యాల, వేలాల గోదావరి ఘాట్ల వద్ద వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు.

ధర్మపురి, బాసరలో గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచారించి ఆలయాల్లో దర్శనం చేసుకున్నారు. వేలాల మల్లిఖార్జునస్వామి ఆలయం, కత్తెరశాల మల్లన్న, బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాల్లో శివరాత్రి శోభ సంతరించుకుంది. బాసర, సోన్, బ్రహ్మపురి వద్ద గోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. శైవ క్షేత్రాల్లో భక్తుల పూజలు కొనసాగుతున్నాయి. కదిలి పాపహరేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. కొమురం భీం జిల్లాలో మహా శివరాత్రి సందర్భంగా వాంకిడి శివకేశవ ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ఈజ్ గాం శివమల్లన్న జాతరకు భక్తులు భారీగా తరలి వచ్చారు. సూర్యాపేట జిల్లాలో శివరాత్రి వర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పిల్లలమర్రి, నాగులపాటి అన్నారంలోని ప్రాచీన శివాలయాల్లో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మేళ్లచెరువు శ్రీస్వయంభూ శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే సైదిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. గద్వాల జిల్లాలో మహాశివరాత్రి సందర్భంగా అలంపూర్ ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. కీసర గుట్టలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం తరపున మంత్రి మల్లారెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భద్రాద్రిలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. అన్నపురెడ్డిపల్లి, మోతె వీరభద్ర స్వామి, పాల్వంచ రామలింగేశ్వర ఆలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఖమ్మం జిల్లాలోని శైవ క్షేత్రాలకు భక్తులతో పోటెత్తాయి. తీర్దాల సంగమేశ్వరాలయం, కూనుమంచి గణపేశ్వరాలయం, పెనుబల్లి నీలాద్రీశ్వరాలయం, బేతువల్లి గౌతమేశ్వరాలయాల్లో భక్తుల రద్దీ కొనసాగుతోంది. సంగారెడ్డి జిల్లాలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శివనామస్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగుతున్నాయి. ఉదయం నుంచే భక్తులు శైవక్షేత్రాలకు తరలివెళ్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చే ఆ మహాదేవున్ని తనివితీరా దర్శించుకున్నారు. జిల్లాలో ప్రముఖ ఆలయమైన కేతకీ సంగమేశ్వరా లయంలో భక్తుల రద్దీ పెరిగింది.

దర్శనం చేసుకున్న మాజీ ఎంపి వినోద్ కుమార్

ఆలయ విస్తరణకు కట్టుబడి ఉన్నామని వెల్లడి
రాజన్న సన్నిధికి భారీగా తరలివచ్చిన భక్తులు

వేములవాడ,మార్చి11(ఆర్ఎన్ఎ): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామికి వస్త్రాలు సమర్పించి కుటుంబ సమేతంగా మంత్రి స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనాలను అందించారు. శివరాత్రి మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామి వారి దివేనతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు. అంతకుముందు తిరుమల తిరుపతి దేవస్థానం తరపున అర్చకులు, అధికారులు శ్రీరాజరాజేశ్వరస్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. టీటీడీ అర్చకులు, అధికారులు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి శ్రీవెంకటేశ్వర స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. మాజీ ఎంపి వినోద్ కుమార్ తదితరులు కూడా స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనాలను అందించారు. ఆలయ విస్తరణ పనులు చేపడతామని, ఇందుకోసం చెరువు భాగాన్ని సేకరించ బోతున్నామని అన్నారు. కాశీ తరహాలో వేములవాడ అవతరించనుందని వినోద్ అన్నారు. శివరాత్రి మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. స్వామి వారి దివేనతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, కలెక్టర్ కృష్ణభాస్కర్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేకు కొవిడ్-19 వ్యాక్సిన్ తొలి డోసు!

ముంబై, మార్చి 11: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే గురువారం కొవిడ్-19 వ్యాక్సిన్ తొలి డోసు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా ప్రారంభమైన కరోనా వైరస్ మలిదశ వ్యాక్సినేషన్ ప్రక్రియలో ఆయన వ్యాక్సిన్ వేయించుకున్నారు. మార్చి 1న కేంద్ర ప్రభుత్వం 60 ఏండ్లు పైబడినవారితో పాటు పలు వ్యాధులతో బాధపడే 45 ఏండ్ల పైబడిన వారికి వ్యాక్సినేషన్ ప్రక్రియను విస్తరించిన సంగతి తెలిసిందే.

మరోవైపు మహారాష్ట్రలో కొవిడ్-19 వైరస్ కేసులు మళ్లీ విజృంభిస్తుండటంతో ఆందోళన నెలకొంది. కేసులు వరుసగా పెరుగుతుండటంతో సెకండ్ వేవ్‌పై భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. మహారాష్ట్రలో బుధవారం ఏకంగా 13,659 తాజా కేసులు వెలుగుచూశాయి. మహమ్మారి కట్టడికి నాగపూర్ నగరంలో లాక్‌డౌన్ విధించారు.

పబ్లిక్ గార్డెన్స్ ప్రాంతంలో నేడు ఆంక్షలు
అలాగే పలుప్రాంతాల్లో ఫ్లై ఓవర్ల మూసివేత

హైదరాబాద్,మార్చి11(ఆర్ఎన్ఎ): 75 ఏండ్ల స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని పబ్లిక్ గార్డెన్స్‌లో శుక్రవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో పబ్లిక్ గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ తెలిపారు. కారు పాసు ఉన్న వారికి లోపలికి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. సాహెబ్-ఇ-మేరాజ్' జగ్నేఖా రాత్ సందర్భంగా గురు,/శుక్రవారం రాత్రి నగరంలోని పలు ఫ్లై ఓవర్లను మూసివేయనున్నారు. రాత్రి 10 గంటల నుంచి గ్రీన్ ల్యాండ్, పీవీఎన్ఆర్, లంగర్‌హౌస్ ఫ్లై ఓవర్లు మినహా మిగతావి మూసివేస్తామని సీపీ వెల్లడించారు.

ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ గమ్యస్థానాలకు వెళ్లాలని పోలీసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో జరిగే వివిధ ఉత్సవాలు, పండుగల వేడుకల సందర్భాల్లో సిటీ పోలీసులు అత్యంత జాగ్రత్తలు తీసుకుంటారన్న సంగతి తెలిసిందే. ప్రముఖ నేతల పర్యటనలు ఉన్నా, భారీ బహిరంగ సభలను నిర్వహిస్తున్నా, ముందుగానే ప్రజలను అప్రమత్తం చేసి, ట్రాఫిక్ ను మళ్లిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే మరోసారి అలాంటి ప్రయత్నాన్నే హైదరాబాద్ పోలీసులు చేపట్టారు. జగ్‌నేకీ రాత్ నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మే 17న తెరుచుకోనున్న కేదార్‌నాథ్
-ఆలయ పండితుల ప్రకటన

డెహ్రాడూన్,మార్చి11(ఆర్ఎన్ఎ): ప్రపంచ ప్రఖ్యాత కేదార్‌నాథ్ ఆలయం తలుపులు మే 17న ఉదయం 5 గంటలకు తెరుచుకోనున్నాయి. కేదార్‌నాథ్ రావల్, అనుభవజ్ఞులైన తీర్థ పురోహితులు, ఆచార్య, వేదపతులు, ముఖ్యమైన సభ్యులు ఉఖిమఠ్‌లోని పంచకేదార్ గడ్డీస్థల్ ఓంకారేశ్వర్ ఆలయం వద్ద గురువారం నిర్ణయాన్ని ప్రకటించారు. ప్రతి సంవత్సరం మహా శివరాత్రి రోజున ఓంకారేశ్వర్ ఆలయంలో కేదార్‌నాథ్ ధామ్ తెలుపులు తెరిచే తేదీని ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయం తలుపులు తెరిచేందుకు మే 13న భైరవనాథ్‌ను ఉఖిమఠ్‌లో పూజించనున్నారు. బాబా కేదార్ డోలీ ఉఖిమఠ్ నుంచి బయలుదేరి మే 14న ఫతాకు చేరుకుంటుంది. 15న గౌరీకుండ్, 15న కేదార్‌నాథ్ ధామ్, 16న కేదార్‌నాథ్ చేరుకుంటుంది. అనంతరం 17న ఉదయం ఐదు గంటలకు భక్తుల దర్శనార్థం తలుపులు తెరుస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో హవనం, భజన సంకీర్తనలు, ఇతర సంకీర్తన కార్యక్రమాలు కొనసాగనున్నాయి. బద్రీనాథ్ ధామ్ ఆలయ తలుపులు మే 18న తెరువనున్నట్లు ఉత్తరఖండ్ చార్‌ధామ్ దేవస్థాన్ మేనేజ్‌మెంట్ ట్రస్ట్‌బోర్డ్ తెలిపింది.

గ్యాస్ పేలుడుకు గుడిసె దగ్ధం

హైదరాబాద్,మార్చి11(ఆర్ఎన్ఎ): రాజధాని నగరంలో భారీ ప్రమాదం తప్పింది. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 11లోని అంబేద్కర్ నగర్‌లో ఉన్న ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలింది. పేలుడు ధాటికి వస్తుసామాగ్రితోపాటు గుడిసె దగ్ధమయ్యింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు

ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో మోడీ ఫోటో తొలగింపు

ఎన్నికల సంఘం ఆదేశాలతో తోణ చర్యలు

న్యూఢిల్లీ,మార్చి11(ఆర్ఎన్ఎ): అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో కొవిడ్-19 వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటోను తొలగిస్తూ కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ గురువారం నిర్ణయం తీసుకుంది. కొవిడ్ వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లపై నరేంద్రమోదీ చిత్రాలు ప్రచురిస్తూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చేసిన ఫిర్యాదుపై కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్యశాఖను ఆదేశించింది. దీంతో పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొవిడ్ వ్యాక్సిన్ సర్టిఫికెట్లలో మోదీ ఫొటోను తొలగిస్తూ కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ తాజాగా నిర్ణయం తీసుకుంది.ఈ మేర కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేష్ భూషన్ ఐదు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు, ఆరోగ్యశాఖ కార్యదర్శులకు రాసిన లేఖలో మోదీ ఫోటో వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లపై తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.

చరిత్రలో నేటినిజం

పదునగు సంభావనలను
పెదవులచు చిత్రములను పెలుగులు నింపన
పిదుదుని గొంటుచు నుంటిని
చిదు రుందు "త్రిపురనేని సాయిచందు"న్!!

-రాధశ్రీ

(మార్చి 12 ప్రఖ్యాత నటుడు సాయిచంద్ పుట్టినరోజు...)

సెల్: 9494481210

ఆహ్వానం

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
మరియు
కవన కిరణాలు తెలుగు సాహితీ సమాఖ్య
సంయుక్త ఆధ్వర్యంలో..

కవన కిరణాలు

రెండవకవితా సంకలనం
శతాధిక కవులు..
అర్ధ సహస్రాధిక కవితలు

మరియు, వెల్మజాల నర్సింహ గారి విరచిత *అగ్ని శిఖ*

పుస్తకావిష్కరణ సభ

ముఖ్య అతిథులు

శ్రీ నందిని సిధారెడ్డి (తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమి తొలి చైర్మన్.)
శ్రీ మామిడి హరికృష్ణ (తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు.)
శ్రీ బైస దేవదాస్ (నేటి నిజం పత్రిక సంపాదకులు.)

విశిష్ట అతిథులు

శ్రీ దేవానంద్ నాగెల్ల (బహుజన సాహిత్య అకాడమి మహారాష్ట్ర శాఖ అధ్యక్షులు)
శ్రీ పులఖండం శ్రీనివాసరావు (గురజాడ విద్యా సంస్థల ప్రిన్సిపాల్, శ్రీకాకుళం)

గౌరవ అతిథులు

శ్రీ మౌనశ్రీ మల్లిక్ (టివి,సినీ గేయరచయిత)
శ్రీ సాహిత్య ప్రకాష్ (టివి,సినీ నటులు)

తేది: 24/03/2021
సమయం: ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల మధ్య.
వేదిక: రవీంద్రభారతి సమావేశ మందిరం
హైదరాబాద్, తెలంగాణ

శివ మంచాల.
సంస్థాపక అధ్యక్షులు
9004428159.

"రైతు జీవితం" అంశంపై కవితలకు ఆహ్వానం..

రైతే రాజన్నారు
రైతే దేశానికి వెన్నెముక అన్నారు
రైతు లేనిదే దేశానికి ప్రగతి లేదన్నారు
రైతే అన్నదాత అన్నారు
తినే ప్రతి గింజమీద మనపేరు ఉంటుందని
అలాంటి ప్రతి గింజను పండించే రైతే
పరబ్రహ్మ స్వరూపం అన్నారు
మరి ఈ రోజు రైతు పరిస్థితి ఏమిటి?
ఎండనక, వాననక
నడిరోడ్డుపై నిస్సహాయంగా చూసే పరిస్థితి
ఈరోజు ఎందుకొచ్చింది?
నేలతల్లిని నమ్ముకున్న రైతుకు
పోరాటం ఎందుకు చేయాల్సి వస్తోంది?

మీ కలాలు ఇచ్చే సమాధానం ఏమిటి?

పాతిక వాక్యాలు మించకుండా
రైతు సమస్య పరిష్కార దిశగా
కలాలను కదిలించండి..

'నేటినిజం' దినపత్రిక,
ఎస్.ఆర్.టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-20
లేదా E-mail : netinizam2020@gmail.com
పేజ్‌మేకర్ ఓపెన్‌ఫైల్, అనుస్ట్రిప్ట్-7లో డిటిపి చేసి మెయిల్ చేయండి..

ఉత్తమమైన కవితలతో 'నేటినిజం' ప్రత్యేక సంచికను వెలువరిస్తుంది. వెంటనే మీ రచనలు పంపగలరు.



మోడీ నిరంకుశ విధానాలపై ఉద్యమించాల్సిందే !

నేటినిజం
శుక్రవారం 12-3-2021

ఎక్కడో ఒక దగ్గర ప్రజావ్యతిరేక విధానాలపై ప్రశ్నించడం మొదలవ్వాలి. తెలంగాణ ఉద్యమంలో తొలి అడుగు తనదే అని సిఎం కెసిఆర్ ఎప్పుడూ చెబుతుంటారు. తను అడుగు వేశాకనే ఒకటి వెనక ఒకటిగా వేలు, లక్షల్లో అడుగులు పడ్డాయని చెబుతుంటారు. అలా తెలంగాణ ఉద్యమం సాకారమయ్యిందన్నది నిజంగా నిజం. స్వాతంత్రోద్యమ కాలంలోనూ గాంధీ మహాత్ముడి వెనకాల ఇలాంటి అడుగులే పడ్డాయి. తద్వారా మనం బ్రిటిష్ ప్రభుత్వాన్ని సాగనంపి స్వేచ్ఛావా యువులు పీల్చగులుగుతున్నాం. ఈ క్రమంలో అనేకానేక సందర్భాల్లో ప్రజా ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయి. నేటికీ ప్రతి చిన్న సమస్యకు ఓ ఉద్యమం చేయాల్సిన ఆగత్యం ఏర్పడుతోంది. అయితే ఇన్నేళ్లూ ఒక ఎత్తయితే ఇప్పుడు మరో ఎత్తు అన్నట్లుగా కేంద్రంలోని నరేంద్ర మోడీ పాలన సాగుతోంది. నిరంకుశానికి పరాకాష్టగా మారింది. తాను చెప్పిందే వేదం అన్న రీతిలో ఏకపక్ష నిర్ణయాలతో ముందుకు సాగుతున్నారు. ప్రజలు తమ జీవనానికే భంగం వాటిల్లేలా.. బతకడమే దుర్భరంగా మారుతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. సమస్యలపై చర్చకు అవకాశం లేకుండా పోతోంది. పార్లమెం ట్‌లో బుల్‌డోజ్ విధానాలు సాగుతున్నాయి. పెద్దనోట్ల రద్దు మొదలు, జిఎస్టి, పెట్రో ధరలు, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలు, ఇంకా స్టీలు, సిమెంట్, ధరలు స్వారీ చేస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు ప్రజలకు దూరంగా కార్పోరేట్లకు దగ్గరగా పనిచేస్తున్నాయి. సామాన్యుడికి బ్యాంకు సేవలు అందుబాటులో ఉండడం లేదు. ఇవన్నీ ఎందుకు ఇలా పెరుగుతున్నాయి.. ప్రజలపై ఎందుకు భారం మోపుతున్నారు.. అన్న దానికి సమాధానం లేదు. ఈ దశలో ఇక దేశానికి తాను రక్షకుడిని ..కాపలాదారును.. చౌకీదారును అంటూ కబుర్లు చెప్పి ప్రజలను నమ్మించిన మోడీ మెల్లగా తన విశ్వరూ పాన్ని చూపిస్తున్నారు. తానోక సేల్స్‌మెన్‌గా నిరూపించుకుంటున్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అమ్మకానికి పెట్టారు. ప్రజలు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదు. డోంట్‌కేర్..ఏం చేసుకుంటారో చేసుకోండన్న రీతిలో ఉన్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న వేళ వాటిపై చర్చించడానికి కూడా సిద్ధంగా లేరు. ఈ క్రమంలో ఎక్కడో ఒక అడుగు పడాలి. ప్రభుత్వ నిరంకుశ విధానాలపై యుద్ధం చేయాలి. ఎవరికి వారు తమ పద్ధతిలో పోరాటంలో ముందుకు సాగాలి. దేశ వ్యాప్తంగా లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం ఇష్టారీతిగా అమ్మటం ద్వారా ఉద్యోగులు అందోళనకు గురికావాల్సి వస్తున్నది. విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కుగా ఉద్యమించి సాధించుకున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేందుకు రంగం సిద్ధమైంది. ఈ విషయంలో మౌనం వహిస్తే రేపు సింగరేణిని సైతం అమ్మే కుట్రలు చేస్తుందని తెలంగాణ మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు అక్షరసత్యాలు. అయితే కేవలం వ్యాఖ్యలకే పరిమితం కాకుండా రాజకీయ ఉద్యమానికి కెటిఆర్ లేదా కెసిఆర్ సారథ్యం వహించి తపన. ఆరాటం. జాతీయోద్యమం ప్రభావం ప్రజల్లో నాటుకోవడం వల్లనే దాని స్ఫూర్తిగా ఉద్యమాలు సాగుతున్నాయి. తెలంగాణ ఉద్యమం కూడా అదే కోవలోకి వస్తుంది. భారతదేశం ఒక ఆధునిక దేశంగా అభివృద్ధి చెందేందుకు ప్రాతిపదికగా ఏర్పడ్డ భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ఆలంబనగా చేసుకుని మాత్రమే ప్రజలు పోరాడుతున్నారు. అయితే రాజ్యాంగం ఇచ్చి అధికారాలను ఉపయోగించుకుని పాలకులు చెలరేగుతున్నారు. దేశంలో పౌరులందరూ సమానమేనని హామీ ఇచ్చినా ఇప్పటికీ, ప్రజలందరికీ అది దక్కడం లేదు. వివిధ ప్రజాతంత్ర వ్యవస్థలకు రూపకల్పన చేసింది. జాతీయోద్యమంలో అప్పటి ప్రజానీకం పెద్దఎత్తున పాల్గొనకపోయి వుంటే మహత్తర రాజ్యాంగం మనకు సాధ్యమయ్యేది కాదు. ప్రజలను ఏదో రకంగా మోసపుచ్చుతూ వస్తున్న పాలకులు ఇప్పుడు ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసేలా తీసుకుంటున్న చర్యలు..రేపురేపు ప్రజల మనుగడనే శాసించే స్థాయికి వస్తాయి. అంతా ప్రైవేట్ చేఇతిలో పెడితే బానిస బతుకులు బతకాల్సి ఉంటుంది. కార్పోరేట్లు శాసింసిందే చట్టంగా ఉంటుంది. మంత్రి కెటిఆర్ అన్నట్లుగా వివాఖ ఉద్యమానికి అడుగులు వేయాలి. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకుండా అడ్డుకోవాలి. అందుకు అవసరమైతే యుద్ధం చేయాలి. ప్రజా ఉద్యమాలను నిర్మించాలి. అందమైన పదాలు చెబుతూ..నరేంద్ర మోడీ తాను అనుకున్న కార్యాన్ని సచ్చీలతను చాటుకోవాలి. అలా వారు అడుగులు వేస్తే వెనకాలే మరో వేయి అడుగులు వేయడానికి జనం సిద్ధంగా ఉన్నాయి. ప్రజాపోరాటం అంటే ప్రజలు తమ స్థితిగతు లను, భౌతిక పరిస్థితులను మెరుగు పరుచుకోడానికి అందరూ కలిసి ఐక్యంగా చేసే ఒక గట్టెక్కించుకుంటున్నారు. బేటీ పడావో...బటీ బజావో..ఆత్మనిర్భర భారత్ వంటి పదాలతో ప్రజలను బురిడీ కొట్టిస్తున్న తీరును ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడమే మోడీ ఎజెండాగా మారిందని గుర్తించాలి. దేశం కోసం అంటూ.. ప్రభుత్వరంగ సంస్థల్ని అమ్ముతున్నారు. అలా చేస్తే జరిగే నష్టం ఎంతో మనం ఇప్పటికే అనేక సంస్థలను అమ్మకోవడం ద్వారా జరిగిన అనుభవాల ద్వారా తెలుసుకుంటున్నాం. ఈ క్రమంలో ప్రభుత్వరంగ సంస్థల పట్ల కేంద్రం వివక్షను కెటిఆర్ ఎండ గట్టారు. విశాఖ ఉక్కు పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కుగా ఉద్యమించి సాధించుకున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్ విషయంలో మనం మౌనం వహిస్తే రేపు సింగరేణిని సైతం అమ్మేస్తారని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థల్ని అమ్ముతుంటే... ఉద్యోగులు అందోళనకు గురవుతుంటే ఇంకా చూస్తూ..చేతులు ముడుచుకుని కూర్చో వాల్సిన అవసరం లేదు. దేశ ప్రయోజనా లు, ప్రజల సంక్షేమం అంతా ప్రభుత్వరంగ సంస్థల భవిష్యత్తు పైనే ఆధారపడి ఉంటాయి. దేశ సంపదను ప్రైవేట్‌పరం చేయటమే పాలనగా మోదీ ప్రభుత్వం వ్యవహరి స్తున్నది. దీన్ని అడ్డుకోవడానికి దేశంలో ప్రజలంతా కలసికట్టుగా పోరాడాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత కాలం అప్పటి ప్రధాని మన్మోహన్ అసమర్థత వల్లే గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగాయని,2జీలో అక్రమాలు అంటూ నినిదించి, తీవ్రంగా విమర్శించిన మోదీ.. ఇప్పుడు చేస్తున్న దేమిటో ఆలోచించాలి. కెటిఆర్ పోరాటానికి శ్రీకారం చుడితే ప్రజలు వెంట నడవడానికి సిద్ధంగా ఉన్నారని గుర్తించాలి. మోడీ విధానాలను ఎండగట్టడానికి ఎవరో ఒకరు గంట కట్టాల్సిందే. బిజెపిలో మాత్రం అలా ఎవరు కూడా సిద్ధంగా లేరు. సమయం వచ్చినప్పుడే మనం ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని ముందుకు సాగాల్సి ఉంది.

ఉద్యోగుల వ్యాక్సినేషన్ ఖర్చు మాదే

–ప్రకటించిన ప్రభుత్వేతర బ్యాంక్ ఐసిఐసిఐ

న్యూఢిల్లీ,మార్చి11(ఆర్ఎన్ఎ): ఉద్యోగుల వ్యాక్సినేషన్ ఖర్చును తామే భరించనున్నామని ప్రైవేటు రంగ బ్యాంక్ ఐసిఐసిఐ ప్రకటించింది. సుమారు లక్ష మంది వరకు ఉండే ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల వ్యాక్సిన్ ఖర్చును భరించనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. ఉద్యోగులు, వారిపై ఆధారపడే కుటుంబ సభ్యుల రక్షణార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. కొవిడ్ నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన రెండు టీకాల ఖర్చు మొత్తాన్ని తాము ఉద్యోగులకు రీయింబర్స్ చేయనున్నట్లు ఐసిఐసిఐ తెలిపింది. కరోనా మహమ్మారి వేళ లక్షల మంది వినియోగదారులకు తమ ఉద్యోగులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సేవలందించారని పేర్కొంది. అలాంటి ఉద్యోగులను, వారి కుటుంబ సభ్యులను కాపాడుకోవడం తమ బాధ్యతగా భావించి ఈ నిర్ణయం తీసుకున్నామని ఐసిఐసిఐ గ్రూప్ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ అధికారి టీకే శ్రీరంగ్ తెలిపారు. ఇప్పటికే పలు కార్పొరేట్ కంపెనీలు తమ ఉద్యోగులకు వ్యాక్సిన్‌ను ఉచితంగా అందిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే.

పక్కింటి మహిళ బెదరింపులు

ఆత్మహత్య చేసుకున్న బాలిక

ముంబై,మార్చి11(ఆర్ఎన్ఎ): నిన్న చంపేస్తా అంటూ పక్కింటి మహిళతో బెదిరించడంతో భయపడి పోయిన ఓ 11 ఏళ్ల బాలిక అనూహ్యంగా ఆత్మహత్య చేసుకుంది. ముంబైలోగల మన్‌ఖర్దు ప్రాంతంలో మార్చి 6న జరిగిన ఈ దారుణం తాజాగా వెలుగులోకి వచ్చింది. తమ ఇంటి ముందు పదే పదే చెత్త పారేస్తున్న పక్కింటి మహిళతో బాలిక, ఆమె తల్లి తగాదా పడ్డారు. వారి వాగ్వివాదం తారాస్థాయికి చేరిన సందర్భంలో పక్కింటి మహిళ బాలికను చంపేస్తానంటూ బెదిరించింది. దీంతో భయపడిపోయిన బాలిక ఆత్మహత్య చేసుకుందంటూ ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. 'తగాదా సందర్భంగా ఆమె బాలికతో పాటూ ఆమె తల్లిని కూడా దర్భాషలాడింది. ఓకానొక సమయంలో బాలికను ప్రాణాలు తీసేస్తానంటూ బెదిరించింది. దీంతో..ఆ మైనర్ పెద్ద పెట్టున ఏడుపు ప్రారంభించింది. ఇరుగు పొరుగు వారు కల్పించుకుని వారికి నచ్చచెప్పి పంపించారు' అని బాధితురాలు ఫిర్యాదు చేసినట్టు ట్రోంబే పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపారు. గొడవ ముగిసాక బాలిక తల్లి తన బంధువుల ఇంటికి వెళ్లింది. ఈలోపు..తన కూతురు ఆత్మహత్యకు పాల్పడినట్టు సమాచారం అందటంతో ఆమె హుటాహుటీన ఇంటికి తిరిగొచ్చి బాలికను ఆస్పత్రికి తరలించింది. అయితే.. ఆమె అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. దీంతో మైనర్ బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. చంపేస్తానని పొరిగింటి మహిళ బెదిరించడంతో భయపడి పోయిన తన బిడ్డ ఆత్మహత్య చేసుకున్నట్టు ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. పక్కింటామె తన బిడ్డను బెదిరిస్తుండగా.. ఇరుగుపొరుగు వారు చూశారని కూడా పేర్కొంది. దీంతో.. పోలీసులు సెక్షన్ 305, 504, 506 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పచ్చదనంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలన

–ఎప్రిల్‌లో పర్యటించనున్న ఎంపిల బృందం

హైదరాబాద్,మార్చి11(ఆర్ఎన్ఎ): తెలంగాణకు హరితహారం ద్వారా పచ్చదనం పెంపులో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన రాష్ట్రానికి మరో గుర్తింపు దక్కనుంది. పచ్చదనం పెంపు, అడవుల పునరుజ్జీవనం, ప్రత్యామ్నాయ అటవీకరణ పనుల్లో తనదైన ముద్ర వేసిన తెలంగాణ రాష్ట్రంలో పర్యటించి అధ్యయనం చేయాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందింది. సీనియర్ పార్లమెంటేరియన్ జైరాం రమేశ్ నేతృత్వంలో సుమారు 25 మంది ఎంపీలు, ఉన్నతాధి కారుల బృందం ఏప్రిల్ నెలలో ఐదురోజుల పాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తారని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్) ఆర్. శోభ వెల్లడించారు. అరణ్య భవన్ నుంచి అన్ని జిల్లాల అటవీ అధికారులతో వీడియో బుధవారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. అడవుల్లో వేసవి సమస్యలు, అగ్ని ప్రమాదాల నివారణ, జంతువులకు నీటి లభ్యత, కంపా నిధుల ద్వారా చేపట్టిన పనుల పురోగతి, వచ్చే సీజన్ హరితహారం కోసం ఏర్పాట్లు, అటవీ అనుమతులు తదితర విషయాలపై చర్చించారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్య ఉత్సవాల సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయని, అటవీశాఖ కూడా ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుం దన్నారు. జిల్లాకు ఒకటి చొప్పున సమస్యాత్మక అటవీ గ్రామాలను గుర్తించటం, అడవుల ప్రాముఖ్యత, అటవీ నేరాల అదుపు, ఆక్రమణలు, జంతువుల వేట, అగ్ని ప్రమాదాల నివారణ, తదితర అటవీ సంబంధిత విషయాలపై అక్కడి ప్రజలను చైతన్యవంతం చేయాలని నిర్ణయించారు. వివిధ ప్రమాదాలు, దాడుల్లో చనిపోయిన జంతువుల నమూనాల సేకరణ, విచారణకు సంబంధించి క్షేత్రస్థాయి అటవీ అధికారులకు సీసీఎంబీ మార్చి నెలలో రెండు రోజుల పాటు (18,19న) శిక్షణా కార్యక్రమం అందిస్తుందని వెల్లడించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, మన్ననూరులో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. అటవీ జంతువుల దాడులు, ఇతర కేసుల్లో సంక్లిష్టతలను చేధించేందుకు, కేసుల విచారణ వేగవంతం చేసేందుకు కచ్చితమైన సమూనాల సేకరణ కీలకమని అన్నారు. ఈ సమావేశంలో పీసీసీఎఫ్ (కంపా) లోకేష్ జైస్వాల్, పీసీసీఎఫ్ (సోషల్ ఫారెస్ట్రీ) ఆర్.ఎం. దోబ్రియల్, పీసీసీఎఫ్ (అడ్మిన్) స్వర్గం శ్రీనివాస్, అదనపు పీసీసీఎఫ్ లు, సర్కిల్ ఇంఛార్జ్ లు, అన్ని జిల్లాల అటవీ అధికారులు పాల్గొన్నారు.

హారిక నియామకాన్ని సమర్థించుకున్న ఛైర్మన్

–ఆమె ఎవరో తెలీదన్న మంత్రి శ్రీనివాస గౌడ్

మహబూబ్‌నగర్,మార్చి10(ఆర్ఎన్ఎ): తెలంగాణ టూరిజం బ్రాండ్ అంబాసిడర్‌గా బిగ్‌బాస్ ఫేం, యూట్యూబర్ దేత్తడి హారికను నియామకం సరైనదేనని టూరిజం ఛైర్మన్ శ్రీనివాస్ సమర్థించుకోగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాత్రం ఆమెఎ ఎవరంటూ ప్రశ్నించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీనివాస్ తెలంగాణ టూరిజం అంబాసిడర్‌గా హారికను నియమిస్తూ.. ఉత్తర్వులు జారీ చేయడమే కాక ఆమెకు అపాయిట్‌మెంట్ ఆర్డర్ సైతం అందజేశారు. అయితే దేత్తడి హారికను టీఎస్‌టీడీసీ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించిన విషయం టూరిజం మంత్రికి కూడా తెలీయదని వార్తలు వచ్చాయి. అయితే, తాజాగా ఈ వ్యవహారంపై తెలంగాణ ఎక్సైజ్, పర్యటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఘాటుగా స్పందించారు. దేత్తడి హారిక నియామకం పట్ల సీఎం కార్యాలయానికి గానీ, ఉన్నతాధికారులకు గానీ ఎలాంటి సమాచారం ఇవ్వలేదని అన్నారు. అసలు ఆ హారిక ఎవరో కూడా తనకు తెలియదని మంత్రి వ్యాఖ్యానించారు.

కంటి చూపును హరించే అదృశ్య శత్రువు గ్లాకోమా..!

(07 – 13 మార్చి "వరల్డ్ గ్లాకోమా వీక్" సందర్భంగా)

కంటి చూపు ఉన్నపుడే పంచరంగుల ప్రపంచాన్ని ఆస్వాదించవచ్చు. భగవంతుని సృష్టిని చూడగలగడమే అపూర్వ ఆస్తి. దృష్టి లేని అభాగ్యుల జీవితాల్లో చీకటే రాజ్యమేలుతుంది. కంటి చూపును పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తలు విధిగా తీసుకోవాలి. 'చికిత్స కన్న నివారణే మిన్న' అని నిత్యం భావిద్దాం. తరుచుగా (కనీసం 2 ఏండ్లకు ఓకసారి) నేత్ర పరీక్షలు చేయించుకుంటూ, ప్రమాదకర అంధత్వం గ్లాకోమా దుస్థితి నుంచి దూరంగా ఉందాం. కంటి చూపు క్రమంగా మందగించడంతో ఏర్పడే దృష్టి లోపాన్ని 'గ్లాకోమా' వ్యాధి అంటాం. గ్లాకోమా అనే కంటి సంబంధ లోపాన్ని నివారించడానికి తరుచుగా కంటి పరీక్షలు చేసుకోవడం, తొలి దశలోనే గుర్తించడం, వైద్యంతో నయం చేసుకోవడం జరుగుతుంది. గ్లాకోమా ముదిరితే కంటి చూపు తగ్గిపోతూ, వైద్యులప కూడా నయం చేయలేని నిస్సహాయ స్థితికి చేరి, చివరకు కోలుకోలేని అంధత్వం వస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2.3 శాతం ప్రజలు గ్లాకోమాతో సతమతం అవుతున్నారని, 4.5 మిలియన్ల గ్లాకోమా రోగులు దృష్టి కోల్పోయారని ప్రకటించింది. ఇండియాలో కనీసం 12 మిలియన్లు గ్లాకోమాతో బాధ పడుతున్నారని, వీరిలో 1.2 మిలియన్లు అంధత్వం పొందారని తేలింది. తెలంగాణలో 5 లక్షల గ్లాకోమా బాధితులు ఉన్నారని అంచనా. సాధారణంగా 90 శాతం కేసుల్లో గ్లాకోమా ముందస్తుగా గుర్తించటం జరగదు. వయసు పెరిగిన కొద్దీ గ్లాకోమా వ్యాధి బారిన పడే అవకాశం పెరుగుతుంది. ఇలాంటి ప్రమాదకర దృష్టి దోష సమస్య తీవ్రతను గుర్తించిన 'ప్రపంచ గ్లాకోమా అసోసియేషన్' నిరంతర కృషితో గ్లాకోమా వ్యాధి పట్ల సామాన్య ప్రజలకు అవగాహన కల్పించే క్రమంలో ప్రతి ఏటా 07 మార్చి నుంచి 13 మార్చి (కొన్ని దేశాల్లో 8 – 14 మార్చి) వరకు 'ప్రపంచ గ్లాకోమా వారం (వరల్డ్ గ్లాకోమా వీక్)' పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. 'ప్రపంచ గ్లాకోమా వారం–2021' నినాదంగా 'ది వరల్డ్ ఈజ్ బ్రైట్, సేవ్ యువర్ సైట్'ను తీసుకొని అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

గత దశాబ్ద కాలంగా గ్లాకోమా సంబంధ దృష్టి లోపాన్ని అనుభవిస్తున్న ప్రజల్లో, ముఖ్యంగా వృద్ధులలో 30 శాతం పెరిగిందని తేలింది. కంటి చూపుకు ప్రధానమైన 'దృష్టి నాడి (ఆప్టిక్ నర్వ్)' దెబ్బతినడం కారణంగా బయట పడే దృష్టి లోపాన్ని గ్లాకోమాగా పిలుస్తారు. నేత్రాలు సక్రమంగా విధులు నిర్వహించడానికి, ఆకారం నిలవటానికి నిర్దిష్ట నేత్ర పీడనం (11 – 21 యంయం మెర్క్యురీ) అవసరం అవుతుంది. దృష్టి నాడి బలహీన పడడం లేదా దెబ్బతినడంతో నేత్ర పీడనం అతిగా పెరగడం జరిగినపుడు దృష్టి నాడి దెబ్బతిని కంటి చూపు క్రమంగా తగ్గిపోతూ, సకాలంలో గుర్తించని యెడల శాశ్విత అంధత్వం రావచ్చు. నేత్ర వ్యవస్థలో నిరంతరం నియమిత పరిమాణంలో జల ద్రవాలు ఊరుతూ, కొంత ద్రవం కంటిలోంచి బయటకు వస్తుంది. ఈ జల ద్రవం అవసరం కన్న తక్కువ ఉత్పత్తి అయినపుడు కంటి వ్యాధికి దారి తీస్తుంది. గ్లాకోమా వ్యాధికి తీవ్రమైన లక్షణాలు ఏవీ కనిపించవు. కంటి నొప్పి లాంటి లక్షణాలు అనుభవంలోకి వచ్చినపుడు నేత్ర వైద్యున్ని సంప్రదించాలి. తరుచుగా కంటి పరీక్షలు చేయించుకోవడం అనే సూత్రమే గ్లాకోమాను ఎదుర్కొనే ఏకైక మార్గమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్లాకోమా వ్యాధిలో దీర్ఘకాలిక (క్రోనిక్) మరియు తీవ్రమైన (అక్యూట్) గ్లాకోమా రకాలు ఉన్నాయి. వయస్సు, మానవ జాతి, బిపి, షుగర్, ఇతర వ్యాధులు, కుటుంబ నేపథ్యం మరియు హ్రస్వ దృష్టి లాంటి అంశాలపై దీర్ఘకాలిక గ్లాకోమా ఆధారపడి ఉంటుంది. నేత్ర పీడనం అతిగా పెరిగినపుడు తీవ్రమైన (అక్యూట్) గ్లాకోమా లక్షణాలకు దారి తీస్తుంది.

తొలి దశలో గ్లాకోమాను గుర్తిస్తే నయం చేసి దృష్టిని కాపాడవచ్చు. వ్యాధి ముదురుతే నయం చేయడం వీలుకాదని తెలుసుకుందాం. తొలి దశలో గుర్తించబడిన రోగులకు కంటి చుక్కలు, ఔషధాలు మరియు శస్త్రచికిత్స విధానంతో నయం చేసే ప్రయత్నాలు చేస్తారు. గ్లాకోమా ప్రమాదం 40 ఏండ్లు దాటిన ప్రజల్లో సాధారణంగా కనిపిస్తాయని తెలుసుకొని, ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి విధిగా నేత్ర పరీక్షలు చేసుకొని గ్లాకోమాకు దూరంగా, జీవిత వెలుగులకు దగ్గరగా ఉండటానికి ప్రయత్నం చేద్దాం. ఎలాంటి వ్యాధి లక్షణాలు లేక పోవడంతో గ్లాకోమా పట్ల ప్రజలు జాగరూకత అత్యవసరం. ప్రపంచ గ్లాకోమా వారం సందర్భంగా సమాజంలో ఉచిత నేత్ర పరీక్షల నిర్వహణ, గ్లాకోమా రోగులకు అవసర చికిత్స, అవగాహన వేదికలు, ఉపన్యాసాలు, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం, విద్యాలయాలలో వ్యాధి పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడం జరగాలి. అదృశ్య శత్రువు గ్లాకోమా, ముందు చూపుతో తరుచుగా పరీక్షలు చేయించుకొని గ్లాకోమాను అంతం చేద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

అక్కపల్లి ఆలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ పూజలు

ధర్మపురి, మార్చి11 : ధర్మపురిలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అక్కపల్లి రాజేశ్వర ఆలయంలో రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రి ఈశ్వర్, స్నేహలత దంపతులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయం రామలింగేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. నేరేళ్ల సాంబశివ ఆలయానికి ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచి భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేసి రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు.

మమతను కలిసేందుకు ఆసుపత్రికి బీజేపీ నేతలు.. అనుమతించని వైద్యులు

కోల్‌కతా: దాడిలో కాలికి గాయమైన పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీని కలిసేందుకు ఆ రాష్ట్ర బీజేపీ నేతలు గురువారం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. బీజేపీ రాష్ట్ర ముఖ్య ప్రతినిధి షామిక్ భట్టాచార్య, సీనియర్ నాయకుడు తథాగ్తా రాయ్ కోల్‌కతాలోని ప్రభుత్వ ఎస్ఎస్‌కెఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మమతను కలవడానికి ప్రయత్నించారు. అయితే మమతను చూడటానికి వైద్యులు వారిని అనుమతించలేదు. దీనిపై బీజేపీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

'మేము మానవతావాదంతో ముఖ్యమంత్రిని కలవడానికి వచ్చాము. అయితే వైద్యులు మాకు అనుమతి ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి అరుప్ బిస్వాస్‌ను కలిశాం. మమతపై జరిగిన దాడిపై ఆందోళన వ్యక్తం చేశాం. ఆమె త్వరగా కోలుకోవాలని కోరుకున్నాం. మా సందేశాన్ని సీఎం మమతకు తెలియజేయాలని బిస్వాస్‌కు చెప్పాం' అని రాయ్ అన్నారు. మరోవైపు ఆసుపత్రి బయట ఉన్న టీఎంసీ కార్యకర్తలు బీజేపీ నేతలు వెనక్కి వెళ్లాలంటూ వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు

మేడిపండు చందంగా బ్రిటన్ రాచరిక వ్యవస్థ

మేఘన్ వ్యవహారంతో బయటపడ్డ పుచ్చు ప్రపంచం మారినా మారని జాత్యహంకారం

న్యూఢిల్లీ,మార్చి11(ఆర్ఎన్ఎ): మనదేశంలోని సాగు చట్టాలపై చర్చించిన బ్రిటన్ పార్లమెంట్ అక్కడ రాజరిక వ్యవస్థలో కూరుకుపోయిన అనమానతలను మా÷తరం ప్రశ్నించదు. ఇప్పుడు బ్రిటన్ రాజరిక వ్యవస్థపై విమర్శలు వస్తున్నాయి. అక్కడ వ్యవస్థీకృతమైన ఫ్యూడల్ విధానాలపై విమర్శలు వస్తున్నాయి. అయినా దీనిపై మాట్లాడని వారు మనదేశంలో సాగు చట్టాల గురించి మాట్లాడుతారు. అనేక దేశాలను తన గుప్పిట పెట్టుకుని పెత్తనం చెలాయించిన బ్రిటన్ ..తమదేశంలో మాత్రం సంస్కరణలకు ముందుకు రావడం లేదు.

ఫ్యూడల్ ధోరణులకు ప్రతీకగా వుండే రాచరిక వ్యవస్థను ఇప్పటికీ కొనసాగించడం ప్రపంచాన్ని నివ్వెర పరిచేలా చేసుకుంటోంది. బ్రిటన్ రాజకుటుంబమంటే ఆ దేశ పౌరుల్లో ఇప్పటికీ అంతో ఇంతో భక్తిప్రపత్తులు ఉన్నాయి. ఆ కుటుంబంలో చోటుచేసుకునే ఏ ఘటనైనా పతాకశీర్షికే. ఎందుకంటే బ్రిటన్ రాణి ఎలిజబెత్–2 ఆ దేశాధినేత. కామన్వెల్త్ దేశాల్లోని చాలా దేశాలకు సైతం ఇప్పటికీ ఆమె అధిపతి. అలాగని ప్రభుత్వ వ్యవహారాల్లో ఆ కుటుంబం పాత్రేమీ వుండదు. వారిని సంప్రదించే వారూ వుండరు. రాజకుటుంబం ప్రస్తుతం గత కాలపు అవశేషం మాత్రమే.

ప్రజాస్వామ్య భావజాలం శరవేగంతో ప్రపంచమంతా విస్తరించ డంతో రాజులు పోయారు... రాజరికాలూ అంతరించాయి. కానీ వాటి తాలూకు అవశేషాలు మానవాళిని ఇంకా పట్టిపీడిస్తున్నాయి. మన దేశంలో వున్న కుల వ్యవస్థలాంటిదే పాశ్చాత్య దేశాల్లో అడుగడుగునా కనబడే వర్ణ వివక్ష. ఇక్కడ అణగారిన వర్గాలవారు జీవితపర్యంతమూ నిత్యం ఎదుర్కొనవలసి వచ్చే కుల వివక్షవంటిది అక్కడ జాత్యహంకారం రూపంలో నల్లజాతివారిని బాధిస్తుంటుంది. వివక్ష ఒక మనిషిని మానసికంగా ఎంత కుంగ దీస్తుందో, ఎలాంటి దుష్ఫలితాలకు దారితీస్తుందో మేఘన్ ఉదంతం మరోసారి చాటింది. ప్రేమాభి మానాలు అడుగంటి, రంగు తప్ప మరేమీ ముఖ్యం కాదనుకుంటున్న రాజకుటుంబం నుంచి నిష్క్రమించి ప్రిన్స్ హ్యారీ, మేఘన్ దంపతులు ఆ కుటుంబానికి ఒకరకంగా మేలు చేశారని చెప్పాలి. రాచరిక దర్పం కనీసం నామమాత్రంగానైనా మిగలాలంటే ముందు మనుషులుగా ప్రవర్తించటం నేర్చుకోవాలని వారు తెలియజెప్పారు. ప్రిన్సెస్ డయాన

ఓట్ల కోసం ప్రజలను మభ్యపెడుతున్న బిజెపి

కెసిఆర్ చేసిన అభివృద్ధి చేసి ఓట్లేయాలి
ఉద్యోగులకు అనుకున్న పిఆర్సి వస్తుంది
మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హామీ

వరంగల్,మార్చి11(ఆర్ఎన్ఎ): బీజేపీ ఓట్ల కోసం ప్రజల్ని మభ్య పెడుతున్నదని, వారితో రాష్ట్రం అభివృద్ధి జరుగదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఆరేకుల విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మంత్రి మాట్లాడారు. మిషన్ భగీరథ లాంటి పథకాలను ప్రజలు అందరూ అభినందిస్తున్నారని మంత్రి తెలిపారు. ఒక్కసారి సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూడండి. టీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీ తో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకన్న జన్మదినం సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఇకపోతే ప్రభుత్వ ఉద్యోగులు ఆశించిన విధంగానే పీఆర్సీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్, ఎంపీ బండా ప్రకాశ్ తో కలిసి మీడియాతో మాట్లాడారు. పొరుగు రాష్ట్రాల కంటే ఒకటి, రెండు శాతం ఎక్కువ పీఆర్సీ వస్తుందన్నారు. ఓట్ల కోసం సవతితల్లి ప్రేమ చూపే పార్టీలను నమ్మొద్దని మంత్రి సూచించారు.

ఇద్దరు ఎమ్మెల్సీలు గెలిస్తే ప్రభుత్వం కూలుతుందని మాట్లాడుతున్నారు. వారికి మెదడు పనిచేయడం లేదు. ఇద్దరు ఎమ్మెల్సీలతో ప్రభుత్వం ఎలా కూలుతుందో చెప్పాలన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తేవడం చేతగాని దద్దమ్మలు, చవటలు చెడగొట్టు మాటలతో ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ప్రజల మద్దతు ఉన్న ప్రభుత్వాన్ని కూల్చడం ఎవ్వరి తరం కాదు. పిచ్చిపిచ్చి కూతలు కూస్తున్న వారికి ప్రజలే తగిన బుద్ధి చెపుతారని హెచ్చరించారు. బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ ఉద్యోగ సంఘాల సమస్య లను పరిష్కరించేందుకు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. అయితే కొందరు కావాలని ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేశారు. ఎలక్షన్ కోడ్ అయిపోయాక పీఆర్సీ ఇచ్చేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

అన్ని వర్గాలకు న్యాయం చేసిన సిఎం కెసిఆర్

ఉద్యోగ నియామకాలపై లెక్కలు చెప్పాం
అయినా విపక్షాల బుర్రలకెక్కడం లేదు
ఎమ్మెల్సీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి

నల్లగొండ,మార్చి11(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి సీఎం కేసీఆర్ న్యాయం చేశారని టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం గత ఆరేండ్లలో చేపట్టిన ఉద్యోగ నియామకాలపై లెక్కలతో సహా వివరణ ఇచ్చినప్పటికీ, ప్రతిపక్షాల బుర్రకు ఎక్కడం లేదని, ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. ఈ విషయంలో గోబెల్స్‌ను మించి అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇతర రాష్ట్రాలకంటే ఎక్కువ పీఆర్సీ తెలంగాణ ప్రభుత్వమే ఇచ్చిందని చెప్పారు. పీఆర్సీకి ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమ్మతిం చారని తెలిపారు. ఉపాధ్యాయులు ఫిట్‌మెంట్, బదిలీలు, ప్రమోషన్లు అడిగారని వారికి కూడా వంద శాతం న్యాయం జరుగుతుందని చెప్పారు. ఉద్యమంలో కేసీఆర్‌తో కలిసి నడిచిన ఉద్యోగులు.. ఎల్లప్పుడూ ముఖ్యమంత్రితోనే ఉంటారని చెప్పారు. ప్రైవేటు టీచర్లు ఇబ్బందుల్లో ఉన్నారని, ప్రభుత్వం వారిని కూడా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రానికి ఐటీఐఆర్ వస్తే లక్షల ఉద్యోగాలు వచ్చేవని, కేంద్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టును రద్దుచేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీస్ ఉద్యోగాల్లో 25 శాతం నల్లగొండ జిల్లాకు చెందినవారే ఉన్నారని చెప్పారు. త్వరలో మరో 60 వేల ఉద్యోగాలకు సంబంధించిన నియామక పక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామని, యాదాద్రి పవర్ఎ÷-లాంట్ నిర్మాణం చేపడుతున్నామని, దండు మల్కాపురం ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేసుకున్నామని వెల్లడించారు. వీటివల్ల వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయని తెలిపారు. దండుమల్కాపురంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఐటీ రంగంలో 2 లక్షల ఉద్యోగాలు సృష్టించామని, ప్రైవేటు రంగంలో మరో 15 లక్షల మందికి ఉద్యోగ కల్పన జరిగిందని వెల్లడించారు. ఏప్రిల్ 1 నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులకు కొత్త పథకం ప్రారంభిస్తామన్నారు. ఈనెల 14న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరు పాల్గొనాలని కోరారు. తనకు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి మరోమారు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

అహ్మదాబాద్,మార్చి11(ఆర్ఎన్): గుజరాత్‌లోని వదోదరకు చెందిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడటం కలకలం రేపింది. బాజ్వాలోని ఆమ్రపాలి సొసైటీలో తన నివాసంలో సోమవారం మధ్యాహ్నం అతడు ఉరివేసుకుని మరణించాడు. తన భార్య, అత్తింటి వారే తన చావుకు బాధ్యులని పేర్కొంటూ ఆయన రెండు పేజీల సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడని పోలీసులు వెల్లడించారు. బాధితుడిని శిశిర్ దర్జీగా గుర్తించారు. శిశిర్ ఇంటికి వెళ్లిన బంధువులు ఎంతసేపటికీ అతను తలుపు తీయకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు.పోలీసు బృందం అక్కడికి చేరుకుని బలవంతంగా తలుపురు తెరవగా శిశిర్ దర్జీ సీలింగ్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించారు. తనను భార్య అత్తింటి వారు వేధింపులకు గురిచేసేవారని రూమ్‌లో ఉంచిన సూసైడ్ నోట్‌లో రాసిఉంది. ఎల్ఎల్‌బీ చదివిన శిశిర్ దర్జీ ఎన్నడూ న్యాయవాద వృత్తిని చేపట్టలేని, మంజాల్పూర్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసే వాడని స్థానికులు తెలిపారు. బాధితుడికి ఎనిమిదేండ్ల కిందట మోనిక అనే మహిళతో వివాహమైంది. పదకొండు నెలల కిందట ఆమె ఓ బిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి ఆమె తిరిగి శిశిర్ ఇంటికి చేరుకోలేదు. బాధితుడు మొబైల్ ఫోన్‌ను ట్రేస్ చేసి వివరాలు రాబడతామని దర్యాప్తులో వెల్లడైన విషయాల ఆధారంగా చర్యలు చేపడతామని స్థానిక పోలీస్ అధికారి డీజే లింబోలా తెలిపారు.

పగిలిన గూడెం ఎత్తిపోతల పైపు

-నీటముగిని పంటపొలాలు

మంచిర్యాల,మార్చి11(ఆర్ఎన్): మంచిర్యాల జిల్లా రంగంపల్లి శివారులో గూడెం ఎత్తిపోతల పథకం పైపులైన్ పగిలింది. దీంతో దాదాపు 200 ఎకరాల్లో పంట నీటమునిగింది. పొలాలు నీటమునగడంతో రైతులు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. ఏటా పైపులైన్ పగులుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పైపులైన్ మరమ్మతు చేసేందుకు నీటిపారుదలశాఖ అధికారులు రంగంలోకి దిగారు.

కాపలాదారు నుంచి సేల్స్‌మేన్‌గా మారిన మోడీ

-స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై మండిపడ్డ ఎమ్మెల్యే సీతక్క

హైదరాబాద్,మార్చి11(ఆర్ఎన్): వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్మికుల ఉద్యమానికి తెలంగాణ నుంచి కూడా మద్దతు పెరుగుతోంది. తెలంగాణ రాష్ట్ర మంత్రి కేటీఆర్ స్పందించి ఉద్యమానికి మద్దతు పలికారు. అవసరమైతే ఉద్యమంలో పాల్గొంటామని అన్నారు. తాజాగా తెలంగాణ కాంగ్రెస్ నాయకురాలు, ములుగు ఎమ్మెల్యే సీతక్క స్పందించారు. ట్విటర్ వేదికగా స్పందించిన ఆమె.. తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీపై సెటైర్ల వర్షం కురిపించారు. చాయ్‌వాలా, కాపలాదారుడు నుంచి సేల్స్‌మన్‌గా ప్రధాని మోదీ మారిన తీరును తాను గుర్తించానని ఆమె అన్నారు. మోదీజీ మీరు పీఎం, సేల్స్‌మన్ కాదు. మా జన్మహక్కులను కాలరాస్తుంటే ఇంట్లో కూర్చొని ఉండలేము. వైజాగ్ ప్రజలారా.. స్టీల్ ప్లాంట్‌పై ఇంచు కూడా వెనకడగు వేయకండి.. మీకు మద్దతుగా నేనున్నానని ట్వీట్ చేశారు.

సాగుచట్టాలు,పెట్రో ధరలపై పట్టువీడని విపక్షం

-రాజ్యసభలో గందరగోళం నేపథ్యంలో 15కు వాయిదా

న్యూఢిల్లీ,మార్చి11(ఆర్ఎన్ఎ): కేంద్ర సాగు చట్టాలు, ఇంధన ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా రాజ్యసభలో విపక్షాల ఆందోళన బుధవారంనాడు కూడా కొనసాగింది. తక్షణం ఈ అంశాలపై చర్చించాలంటూ సభా కార్యక్రమాలను విపక్షాలు అడ్డుకున్నాయి. దీంతో రెండు సార్లు వాయిదా పడిన సభ... ఆ తర్వాత ఈనెల 15వ తేదీ వరకూ వాయిదా పడింది.తొలుత సభాకార్యక్రమాలు ప్రారంభం కాగానే, విపక్ష ఎంపీలు సాగు చట్టాలకు, రోజురోజుకూ పెరుగుతున్న ఇంధనం ధరలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సభా కార్యక్రమాలను మధ్యాహ్నం 12 గంటల వరకూ రాజ్యసభ డిప్యూటీ చైర్‌పర్సన్ హరివంశ్ వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో మార్పులేకపోవడంతో 2 గంటల వరకూ సభ వాయిదా పడింది. అనంతరం సభ తిరిగి ప్రారంభమైనా విపక్షాలు వెన్కక్కి తగ్గలేదు. సాగు చట్టాలు, ఇంధన ధరల పెరుగుదలపై చర్చించాలంటూ పట్టుపట్టాయి. దీంతో సభను 15వ తేదీ వరకూ వాయిదా వేస్తున్నట్టు డిప్యూటీ చైర్‌పర్సన్ ప్రకటించారు. పార్లమెంటు రెండో విడత బ్జడెట్ సమావేశాలు గత సోమవారంనాడు ప్రారంభమయ్యాయి.

జాగరణం శివరాత్రి ప్రత్యేకం

హైదరాబాద్, మార్చి10(ఆర్ఎన్ఎ)శివుడు లయకారకుడు. శివారాధకులకు మహాశిరాత్రి పర్వదినం. ఉపవాసం ఈ పండగ ప్రత్యేకత. శివుడు భోళాశంకరుడు కావడంతో అడకుండానే వరాలిచ్చే దేవుడుగా ప్రతీతి. శివరాత్రి రోజు ఉపవాసంతో... రాత్రి అభిషేకించి జాగారం చేస్తే ముక్తి లభిస్తుందని ఆర్యోక్తి. అందుకే శివరాత్రి జాగారాలకు ప్రాధాన్యం ఉంది. ఈశాన సంహిత ప్రకారం శివుడు అర్ధరాత్రి సమయంలో తేజోలింగంగా ఆవిర్భవించాడు. అదే లింగోద్భవకాలం. అలా పరమశివుడు లింగాకారంలో పుట్టినరోజు కావడంచేత శివుడికి ఇష్టమైన ఆ రోజున శివపూజ జరపడం మంచిదని శైవం చెబుతోంది. మహాశివరాత్రి మాఘమాసం కృష్ణపక్షంలో అర్ధరాత్రి ఉండే చతుర్దశి తిథినాడు వస్తుంది. చతుర్దశి తిథి శివుడికి ఎంతో ప్రీతికరమైంది. అందులోనూ కృష్ణచతుర్దశి అంటే అమావాస్యకు ముందు వచ్చే చతుర్దశి తిథి మరీ ప్రీతికరమైంది. ఆ కారణంగానే ప్రతి మాసంలోనూ వచ్చే కృష్ణచతుర్దశి తిథులు మాసశివరాత్రులుగా ఉంటాయి. సంవత్సరం లోని పన్నెండు శివరాత్రులలో మాఘమాసంలో వచ్చే శివరాత్రి శివుడికి బాగా ఇష్టమైంది కాబట్టి దాన్ని మహాశివరాత్రి అని అంటారు. శివుడు అభిషేక ప్రియుడే గాకుండా.. అలాగే బిల్వదళ ప్రియుడు. అందుకే అభిషేకాలు, బిల్వార్చనలను శివరాత్రినాడు విధిగా చేస్తుంటారు. తెలిసైనా, తెలియకైనా కొన్ని నీళ్ళు శివలింగం మీద పోసి మరికొన్ని మారేడు దళాలు ఆ శివలింగంమీద పెడితే భోళాశంకరుడు పరవశించి అలా చేసినవారిని అనుగ్రహించిన కథలు ఎన్నెన్నో మన పురాణాల్లో కనిపిస్తున్నాయి. అందుకే భక్తులు శివరాత్రి రోజు అభిషేకం చేసి జాగారం చేయడం ఆనవాయితీగా వస్తోంది. శివుడు మిగతా దేవతలతో పోలిస్తే సులువగా అనుగ్రహం ఇస్తాడని నమ్మిక. శివనామంతో సర్వపాపాలు హరించుకుని పోతాయని అంటారు. అందుకే మనదేశంలో అనే శైవాలయాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. కాశితో పాటు జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు జరుపుతారు. వినాయక చవితి, శ్రీరామనవమి లాంటి పండుగలలో దేవుళ్లను పగటిపూట పూజిస్తారు. శివరాత్రినాడు శివుడిని రాత్రిపూట మాత్రమే పూజించడం, మిగిలిన పండుగలలా పంచభక్ష్య పరమా న్నాలతో కాక ఉపవాస దీక్షతో శివరాత్రి పండుగను జరుపుకోవడం ఓ విశేషం. త్రిమూర్తులలో మూడోవాడు శివుడు. బ్రహ్మ సృష్టికర్త. విష్ణువు సంరక్షకుడు. మహాశివరాత్రి వ్రతాచరణను గురించి లింగ పురాణం పేర్కొంటోంది. వ్రత ఉద్యాపన గురించి స్కందపురాణంలో వివరంగా ఉంది. శివరాత్రి నాడు పగలంతా ఉపవాసం, రాత్రిపూట లింగార్చన, జాగరణం చేస్తారు. లింగార్చన తరువాత పార్వతీ,పరమేశ్వరుల కల్యాణం చేయడం కూడా ఓ అలవాటుగా వస్తోంది. శివరాత్రులు అయిదు రకాలు. అవి.. నిత్య శివరాత్రి, పక్ష శివరాత్రి, మాస శివరాత్రి, మహాశివరాత్రి, యోగశివరాత్రి. నిత్యశివరాత్రి అంటే ప్రతిరోజూ రాత్రిపూట చేసే శివారాధన. పక్ష శివరాత్రి అంటే ప్రతి పదిహేను రోజులకొకసారి శివార్చన కోసం నిర్దేశిరచిన రాత్రి. మాసశివరాత్రి అంటే ప్రతి మాసంలోనూ శివపూజకు ఉద్దేశించిన రాత్రి. మిగతా శివరాత్రులు ఏవి కుదిరినా కుదరకపోయినా ఏడాదికొకసారి వచ్చే మహాశివరాత్రినాడు శివపూజ చేయడం పుణ్యప్రదం. యోగి అయినవాడు తన యోగబలం చేత యోగనిద్రలోకి వెళ్లే రాత్రిని యోగశివరాత్రి అని అంటారు. సాధారణంగా రాత్రిపూట దేవీపూజను, పగటిపూట దేవపూజను చేయడం ఒక ఆచారంగా ఉంటుంది. కానీ శివరాత్రి విషయంలో మాత్రం ఇది భిన్నంగా కనిపిస్తుంది. శివరాత్రి రోజున రాత్రిపూటే శివపూజ జరుగుతుంది. ఇలా శివ ఆరాధన రాత్రిపూట జరగడానికి ఓ కారణం కూడా ఉంది. పూర్వం ఓసారి ప్రళయం వచ్చినప్పుడు అంతా కటికచీకటిగా మారిపోయింది. ఆ సమయంలో లోక కల్యాణం కోసం పార్వతీదేవి శివుడిని గురించి తపస్సు చేసింది. ఆనాటి పార్వతి తపస్సు మెచ్చిన శివుడు ఆ చీకటిని పోగొట్టి మళ్లీ మామూలుగా రాత్రి,

పగలు ఏర్పడేలా చేశాడు. దాంతో జీవులన్నీ మళ్లీ ఆనందించాయి. తాను చేసినట్లుగా అంత రాత్రివేళ శివుడిని గురించి పూజలు చేసినవారికి సర్వసుఖాలు కలిగేలా అనుగ్రహించమని పార్వతీదేవి శివుడిని ప్రార్థించింది. శివుడు అందుకు అంగీకరించాడు. పార్వతి చేసిన శివపూజకు గుర్తుగా ఆనాటి నుంచి మహాశివరాత్రి పూజా పర్వదినం ఏర్పడింది. శివరాత్రినాటి లింగోద్భవ సమయంలో చేసే అభిషేకాలలో కూడా కొన్ని పద్ధతులున్నాయి. రాత్రి జాగరణం చేస్తూ నాలుగు జాములలోనూ నాలుగు సార్లు నాలుగు రకాలుగా అభిషేకాలు చేస్తుంటారు. మొదటి జాములో పాలతో అభిషేకించి, పద్మాలతో పూజచేసి పెసర పప్పు, బియ్యం కలిపి పులగం వండి శివుడికి నైవేద్యం పెడతారు. రుగ్వేద మంత్ర పఠనం జరుపుతారు. రెండో జాములో పెరుగుతో అభిషేకం, తులసీ దళార్చనచేసి, పాయసం నైవేద్యంపెట్టి యజుర్వేద మంత్రాలను చదువుతారు. మూడోజాములో నేతితో అభిషేకించి, మారేడు దళాలతో అర్చించి, నువ్వుల పొడి కలిపిన తిను బండారాలను నివేదిస్తారు. సామవేద మంత్రపఠన చేస్తారు. నాలుగో జాములో తేనెతో అభిషేకంచేసి నల్ల కలువలతో పూజించి అన్నం నివేదిస్తారు. అథర్వణ వేద మంత్రాలను చదువుతారు. ఇలా అభిషేకాలు చేసే శక్తిలేనివారు అభిషేకం చేసేటప్పుడు శివదర్శనం చేసుకున్నా పుణ్యమే నంటారు. నాలుగో జాము ముగిశాక ఉదయంపూట శివుడిని ఊరేగిస్తారు. ఇలా ఊరేగించడం వెనుక ఓ సామాజిక అంతరార్థం ఉంది. ఎవరైనా ఏ కారణం చేతనైనా ఆలయాలకు వెళ్ళి శివదర్శనం చేసుకోలేకపోతే వారికి ఆ ఊరేగింపును చూసి పుణ్యం పొందే భాగ్యం కలుగుతుందని అంటారు. శివుడు ఎలా పిలిచినా అనుగ్రహిస్తాడని అందుకే భోళాశంకరుడని పురాణాలు కూడా చెబుతున్నాయి.

బీజేపీ నేతలను కలవర పెడుతున్న పరిస్థితులు

కానారాని దుబ్బాక నాటి భావోద్వేగాలు
కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలతో మారుతున్న మనోగతాలు
కెసిఆర్ దిద్దుబాటు చర్యలతో ఆలోచనలో పట్టభద్రులు

హైదరాబాద్,మార్చి11(ఆర్ఎన్ఎ): తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సమయం దగ్గర పడుతోంది. ప్రచారంలో క్షణం తీరిక లేకుండా అభ్యర్థులు ఉన్నారు. 14న జరిగే ఎన్నికలు ఓ రకంగా బిజెపికి పరీక్షగా మారనున్నాయి. దుబ్బాక, జిహెచ్ఎంసి నాటి పరిస్థితులను మించి..ఇప్పుడుఉ కేంద్రం అనుసరిస్తున్న విధానాలు చర్చనీయాంశంగా మారాయి. దేశంలో నిరుద్యోగ సమస్య పెరగడంతో పాటు, ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మాలన్న దుందుడుకు, నిరంకుశ విధానాలు యువతకు గొడ్డలిపెట్టు కానున్నాయి. ఉన్న సంస్థలను అమ్ముతూ పోతే ఇక ఉద్యోగాల సంగతి ఉత్తిమాటే కానుంది. అలాగే పెట్రో, గ్యాస్ ధరలతో ప్రజలు అల్లాడుతున్నారు. కెసిఆర్ విధానాలతో పోలిస్తే మోడీ విధానాలే డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయన్న భయం ప్రజల్లో కనినిస్తోంది. ఇలాంటి విషయాలను బిజెపి నేతలు ఎక్కడా ప్రస్తావిం చడం లేదు. కేవలం టిఆర్ఎస్, కెసిఆర్ కటుంబ వ్యవహారాలను మాత్రమే ప్రచారం చేస్తున్నారు. దీంతో తమకు ఒరిగేదేమిటన్న ఆలోచన నిరుద్యగ యువతలో కనిపిస్తోంది. దీంతో ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి రెండు సీట్లు గెలవడం అంత సులువు కాదన్న చర్చ కూడా సాగుతోంది. దీంతో అందరి దృష్టీ మొదటి ప్రాధాన్య ఓటుపైనే ఉంది. ఎక్కువమంది బరిలో ఉండటంతో తమ విజయావకాశాలకు ఎక్కడ గండిపడుతుందో అన్న భయం ప్రధాన పార్టీలను వెన్నాడుతున్నట్టు సమాచారం. రాజకీయ వర్గాల్లో చర్చ మొత్తం మొదటి, రెండు ప్రాధాన్య ఓట్ల చుట్టూనే తిరుగుతోంది. మొన్నటి వరకు గెలుపు తమదే అన్న ధీమాతో కనిపించిన బీజేపీ నేతలు ఇప్పుడు వాస్తవ పరిస్థితులను బేరీజు వేసుకుంటున్నారని సమాచారం. మొదటి ప్రాధాన్య ఓట్లు చీలితే.. రెండో ప్రాధాన్య ఓట్లు గెలుపోటములను నిర్ధారించే పరిస్థితి ఉంటుంది. అందుకే ఫస్ట్ ప్రిఫరెన్షియల్ ఓట్లు చీలకుండా ఎవరికి వారు జాగ్రత్త పడుతున్నారు. వీలైనన్ని ఎక్కువ మొదటి ప్రాధాన్య ఓట్లు సాధించాలనే లక్ష్యంగా కమలనాథులు వ్యూహం పన్నినా సాధ్యం అవుతుందా అన్నది కూడా తేలాల్సి ఉంది. ఇకపోతే విశాక స్టీల్ విషయంలో తీసుకున్న నిర్ణయం, గ్యాస్, పెట్రో దరలు కూడా సామాన్యులను ఆలోచించేలా చేస్తున్నాయి. ప్రజలు కూడా బిజెపి బదులు ఇతర ప్రవ్నించే గొంతుకలను వెతుకుంటున్నాయి. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో లబ్దప్రతిష్టులయిన కోదండరామ్ లాంటి వారు కూడా బరిలో ఉండడం బిజెపికి మైనస్‌గా మారనుంది. అందుకే కోదండరామ్‌కు వచ్చే రెండో ప్రాధాన్య ఓట్ల కంటే భారీ తేడాతో ఫస్ట్ ప్రిఫరెన్షియల్ ఓట్లు సాధించాలనే వ్యూహ రచన చేస్తోంది బీజేపీ. అలాగే కౌంటింగ్ చివరి వరకు మొదటి రెండు స్థానాల్లో ఉంటే తప్ప బయటపడలేమని భావిస్తున్నారు. అలాగే హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుముఖ పోటీ నెలకొని ఉంది. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో భారీ స్థాయిలో ఓట్లు నమోదు చేయించామని.. ఆ ఓట్లు పడితే చాలు అని అనుకుంటున్నారు బీజేపీ నాయకులు. ఇక్కడ మొదటి ప్రాధాన్య ఓట్లలో వెనకపడితే తర్వాత ప్రాధాన్య ఓట్లతో పుంజుకోవడం కష్టమనే అభిప్రాయం పార్టీ నేతల్లో ఉంది. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న ఈ సమయంలో ఎంతమంది ఓటర్లను బీజేపీ నేతలు ఆకట్టుగకోగలరన్నది చూడాలి. ఇక్కడ కెసిఆర్ వ్యూహాత్మకంగా పివి తనయ వాణిదేవిని నిలబెట్టడం కూడా టిఆర్ఎస్‌కు కలసి వస్తోంది. మొత్తంగా గతంలొ ఉన్న పరిస్థితులు మాత్రం లేదవని బిజెపి నేతలు కూడా అంతర్గతంగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పిఆర్సి, ఉద్యోగ వయోపరిమితి కూడా ప్రభావం చూపనుందని అంటున్నారు.

ఎపిలో శివాలయాలకు పోటెత్తిన భక్తజనం

నదీ,సముద్ర స్నానాలతో తరించిన భక్తజనం
పంచారామ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
ప్రధాన శైవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
గుడివాడలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సిఎం జగన్,మంత్రి నాని

అమరావతి,మార్చి11(ఆర్ఎన్ఎ): శివరాత్రిని పురస్కరించుకుని ప్రధాన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పంచాయారమ క్షేత్రాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నదీస్నానాలు, సముద్ర స్నానాలు చేసి శైవాలయాల్లో పూజలు నిర్వహించారు. అమరావతి, ద్రాక్షారామం, పాలకొల్లు, విజయవాడ, శ్రీశైలం, మహానంది, కాళహస్తి తదితర పుణ్యక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో పాల్గొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న శివరాత్రి మహోత్సవాల్లో ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి కొడాలి నాని ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జగన్ ప్రత్యేక పూజల్లో పాల్గొని శివలింగానికి అభిషేకం చేశారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలా డుతున్నాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగుతున్నాయి.

విజయవాడ కృష్ణానదిలోని పున్నమి ఘాట్, కృష్ణవేణి, పవిత్ర సంగమంలో భక్తులు పుణ్యస్నానాలతో మొక్కులను చెల్లించుకుంటున్నారు.

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయనాకి భక్తులు పోటెత్తారు. శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసారు. తెల్లవారు జామునుంచే శివుడికి భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి..స్వామివారిని దర్శించుకున్నారు. జగ్గయ్యపేట మండలం ముత్యాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి కృష్ణానదిలో భక్తులు స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు.

తోట్లవల్లూరు మండలం ఐలూరు రామేశ్వరస్వామి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా శైవలయాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంది.

త్రిపురాంతకం, భైరవకొన, జమ్ములపాలెం, సోపిరాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివరాత్రిని పుస్కరించుకుని పట్టిసీమ క్షేత్రానికి భక్తులు తరలివచ్చారు. అటు పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. మరోవైపు పట్టిసీమ పట్టిసాచలక్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వీరభద్రేశ్వర స్వామికి వంశపారంపర్య ధర్మకర్తలు తొలిపూజ నిర్వహించారు. సామర్లకోట కుమారరామ భీమేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ద్వారకాతిరుమల శేషాచల కొండపై శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శివనామస్మరణతో శివాలయం మారువోగుతోంది. స్వామివారికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. తిరుపతి కపిలతీర్థంలో శివరాత్రి సందర్భంగా భక్తులు పోటెత్తారు. కపిలతీర్థం జలపాతం దగ్గర భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆపై మహిళలు పిండి దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. రాజమండ్రి పుష్కర ఘాట్, కోటిలింగాల ఘాట్‌లో భక్తులు పోటెత్తారు. ఏలేశ్వరంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఏలేరు నది తీరంలో భక్తుల పుణ్యస్నానాలు ఆచరించారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధి: మంత్రి ఈటల

కరీంనగర్. మార్చి 11(నేటినిజం ప్రతినిధి):మహాశివరాత్రి సందర్భంగా వీణవంకలోని శివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం ఈటల మాట్లాడుతూ.. మన ప్రాంతంలోని పురాతన ఆలయాలు ఆధ్యాత్మిక జీవనాన్ని పెంపొందించడానిక

ఓం నమః శివాయ - శివ శివ శంభో శంకర

మహాశివరాత్రి పండుగ ప్రాశస్త్యం

మహాశివరాత్రి హిందు మతంలో జీవించే వారికి ప్రత్యేక పండుగ. ఆరోజు ప్రతి ఇంటిలో కుటుంబంలోని పెద్దలు, చిన్నవారు బ్రహ్మ ముహూర్తంలో స్నానాదికాలు ముగించుకున్నవారై శివునిపై అత్యంత భక్తి శ్రద్ధలతో అభిషేకాలు, అర్చనలు జరుపుతూ, శివాలయాలను దర్శించుకుంటారు. ఆరోజంతా ఉపవాసంచేసి శివుని స్తోత్రాలు పారాయణం చేస్తూ ఓంకారంతోను, ఓం నమః శివాయా అనే మంత్రాన్ని పఠిస్తూ, శివనామ స్మరణతో హోమాలు చేస్తుంటారు. రాత్రి సమయాన శివుని గీతాలు, భజనలు, శివ తాండవ నృత్యంతో కోలాహలంగా బోళాశంకరుని (శివుని) ప్రసన్నం చేసుకుంటారు. గురువులు భక్తులతో వారి వారి నియమానుసారంగా క్రియాయోగ, సుషుమ్న క్రియాయోగ మొదలైన ప్రక్రియలతో భక్తులను అలరిస్తూ, ప్రవచనాలు బోధిస్తూ ధ్యానంతో భక్తులకు సద్గతి పొందేవిధంగా శివరాత్రి జాగరణ చేయించడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయంగా పేర్కొనవచ్చు. శివపార్వతుల వివాహం జరిగిన రోజని, లింగాకారంలో ఉద్భవించిన రోజని శివపురాణంలో ఉవాచ. మహా శివరాత్రి చాంద్రమాన నెల లెక్కింపు ప్రకారం మాఘమాసం యొక్క కృష్ణ పక్ష చతుర్దశి రోజున వస్తుంది. ప్రతీ ఏటా మాఘ బహుళ చతుర్దశి నాడు చంద్రుడు శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర యుక్తుడైనప్పుడు వస్తుంది. సంవత్సరంలో పన్నెండు శివరాత్రులలో మహా శివరాత్రి అత్యంత పవిత్రమైనదిగా భావింపబడుతుంది.

రుద్రాభిషేకం:

వేదాలలోనుండి ప్రత్యేకమైన మంత్రాలను రుద్ర సూక్తంగా పండితులచే పఠించబడుతుంది. దీనిని శివలింగానికి ప్రాతఃకాలంలో పవిత్రస్నానం చేయిస్తారు. దీనినే రుద్రాభిషేకం అంటారు. శివలింగంతో బాటు గండకీ నదిలో మాత్రమే లభించే సాలిగ్రామం కూడా పూజలందుకుంటుంది. దీనిద్వారా మనసులోని మలినాల్ని తొలగించుకోవడమే ఇందులోని పరమార్థం.

పుష్పాలతోను, బిల్వపత్రాలతో అర్చన:

శివునకి ప్రీతికరమైన పుష్పాలతోను, బిల్వపత్రాలతో అర్చన చేస్తుంటారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, రకరకాల పండ్లు, ఇత్యాదులతో శివుని సేవిస్తూ వారి వారి తాహతుకు లోబడి, భక్తులు శివుని సేవించి తరించడం పరిపాటి. రోజంతా పగలు రాత్రి ఉపవాసం ఉండి రాత్రి అంతా జాగరణము చేసి మరునాడు భోజనం చేస్తారు. అన్ని శివక్షేత్రాలలో ఈ ఉత్సవము గొప్పగా జరుగుతుంది. శైవులు ధరించే భస్మము/విభూతి తయారుచేయటానికి ఈనాడు పవిత్రమైనదని భావిస్తారు.

ఆధ్యాత్మిక శక్తి:

తపస్సు, యోగ, ధ్యానం వాటి అభ్యాసంతో క్రమంగా, వేగంగా జీవితం యొక్క గమనము అత్యధికంగా ముక్తి పొందడానికి ఆరోజంతా శివుని సేవలో, ధ్యానంలో తరిస్తారు. మహా మృత్యుంజయ మంత్రం వంటి శక్తి వంతమైన పురాతన సంస్కృత మంత్రాల యొక్క ప్రయోజనాలు శక్తి ఈ రాత్రి గొప్పగా పెరుగుతుంది.

పంచాక్షరి మంత్రం:

పంచాక్షరి మంత్రం శివస్తోత్రాలలో అత్యుత్తమమైనది. ఈ మంత్రంలోని పంచ అనగా అయిదు అక్షరాలు "న" "మ" "శి" "వా" "య" (ఓం నమశ్శివాయ) నిరంతరం భక్తితో ఈనాడు పఠిస్తే శివసాయుజ్యం ప్రాప్తిస్తుంది.

మహామృత్యుంజయ మంత్రం:

మహామృత్యుంజయ మంత్రం ఋగ్వేదం (7.59.12)లోని ఒక మంత్రము. దీనినే "త్రయంబక మంత్రము", "రుద్ర మంత్రము", "మృత సంజీవని మంత్రము" అని కూడా అంటారు. ఈ మంత్రాన్ని మృత్యుభయం పోగొట్టుకోవడానికి, మోక్షం కొరకు జపిస్తారు.

ఓం త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టి వర్ధనం ఊర్వారుకమివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మామృతాత్

దక్షిణ భారతదేశంలో మహాశివరాత్రి:

మహా శివరాత్రి ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడు అన్ని దేవాలయాలు విస్తృతంగా జరుపుకుంటారు. శ్రీకాళహస్తిని కాశీ కన్నా మహిమాన్వితమైన క్షేత్రంగాను, దక్షిణ కైలాసంగాను భావిస్తారు. తమిళనాడులోని తిరుచిరాపల్లికి 11 కి.మీ. దూరంలో శివుని జంబుకేశ్వరాలయం, పవిత్ర కావేరి నది ఒడ్డున ఉన్నది. అలాగే అరుణాజలం, చెన్నైకి 185 కి.మీ. దూరంలో శివుడు తేజోలింగస్వరూపుడై విరాజిల్లుతాడు. ఈ క్షేత్రాన్ని అగ్ని క్షేత్రమని అంటారు. శివుడు (మొదటి) ఆదిగురువుగా భావిస్తారు. శివుడు నుండి యోగ సంప్రదాయం ఉద్భవించింది. సంప్రదాయం ప్రకారం, మానవ వ్యవస్థలో శక్తి సహజంగా ఉంది. ఆ శక్తి పెంపొందేందుకు ఈ రాత్రి శక్తివంతమైన గ్రహ స్థానాలు అటువంటివి ఉన్నాయి. రాత్రి అంతా (జాగరూకత), మెలుకువగా ఉన్న ఒక వ్యక్తి, శారీరకంగాను, ఆధ్యాత్మికంగాను క్షేమాన్ని పొందుతారని చెబుతారు. ఈ రోజు, అటువంటి శాస్త్రీయ సంగీతం, నృత్యం వంటి వివిధ రంగాలలో నుండి కళాకారులు మొత్తం రాత్రి అంతా జాగారం చేస్తారు.

భారతదేశంలోను విదేశాలలోను మహాశివరాత్రి:

ఉత్తరభారతంలోని, కాశీ క్షేత్రం ప్రముఖ దేవాలయంగా పేరుపొందినది. పుట్టిన ప్రతి ఒక్కరు జీవితంలో ఒక్కసారైనా గంగానదిలో స్నానమాచరించి, కాశీ క్షేత్రాన్ని దర్శించి తొమ్మిది (9) రాత్రులు నిద్రచేసిన వారు శివసాన్నిధ్యం పొందగలరని విశ్వసిస్తారు. మహాకాళేశ్వర్ దేవాలయం, ఉజ్జయినీ పేరున స్వామి శివుడు వేంచేసిన పవిత్ర అత్యంత ప్రాచుర్యం పొందిన దేవాలయాల్లో ఒకటి. ఇక్కడికి శివ భక్తులు పెద్ద సమూహాములతో మహా శివరాత్రి రోజున ప్రార్థనలు చేయడానికి ప్రతి సంవత్సరం చేరుకుంటారు. నేపాల్‌లో, కోట్లాది హిందువుల ప్రఖ్యాత పశుపతినాథ్ ఆలయం వద్ద ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి కలిసి శివరాత్రికి హాజరు అవుతారు. ట్రినిడాడ్, టొబాగోలో, దేశవ్యాప్తంగా వేలాది హిందువులు 400 పైగా ఆలయాల్లో పవిత్రమైన మహాశివరాత్రి రోజు రాత్రి శివుడికి ప్రత్యేక అభిషేకాలు అందించటం ద్వారా గడుపుతారు. వేలాది భక్తులు శివరాత్రి రోజు బాగమతి నదిలో స్నానము చేసి, శివరాత్రి పండుగ జరుపుకొంటారు. బంగ్లాదేశ్లో హిందువులు కూడా మహా శివరాత్రి జరుపుకుంటారు.

హాలాహలం సేవనం:

సాగర మథనం పురాణం ప్రకారం, సాగర మథనం యొక్క ఉత్పత్తులలో ఒకటి అయినటువంటిది హాలాహలం ఉద్భవించింది. శివుడు ఆ హాలాహలం మొత్తం తీసుకోవడంవలన, హాలాహలం యొక్క ఘోరమైన ప్రభావాల నుండి ప్రపంచం మొత్తం రక్షించడం జరిగింది. శివుడు తన యోగ అధికారాల ద్వారా తన గొంతులో హాలాహలం నిక్షిప్తం చేయడం వలన, ఆ ప్రభావంతో కంఠం నీలంగా మారినది, అందుచేతనే శివుని నీలకంఠుడు, గరళ కంఠుడు అంటారు.

శివుడు బ్రహ్మ గర్వము అణచడానికి తన కనుబొమ్మల నుండి భైరవుడిని సృష్టించి పదునైన కత్తితో ఈ బ్రహ్మను శిక్షించుము అని చెబుతాడు. ఆ భైరవుడు వెళ్లి బ్రహ్మ పంచముఖాలలో ఏ ముఖము అయితే అసత్యము చెప్పిందో ఆ ముఖాన్ని పదునైన కత్తితో నరికి వేస్తాడు. అప్పుడు మహావిష్ణువు శివుడి వద్దకు వెళ్లి, పూర్వము ఈశ్వర చిహ్నంగా బ్రహ్మకు ఐదు ముఖాలు ఇచ్చి ఉంటివి. ఈ మొదటి దైవము అగు బ్రహ్మను ఇప్పుడు క్షమించుము అన్నాడు. ఆ మాటలు విన్న శివుడు శరణు జొచ్చిన బ్రహ్మను (పిల్లవానిని తప్పుడు చేతకై దండించి తప్పు తెలుసుకొన్న తరువాత కారుణ్యమును ప్రకటించిన తండ్రిలా) ఉద్దేశించి గొప్ప వరమును ప్రసాదించెను. బ్రాహ్మణి క్షమించి, "ఓ బ్రహ్మా నీకు గొప్పనైన దుర్లభమైన వరమును ఇస్తున్నాను, అగ్నిష్టోమము, దర్శ మొదలగు యజములలో నీది గురుస్థానము. ఎవరేని చేసిన యజములలో అన్ని అంగములు ఉన్నా అన్నింటినీ సరిగా నిర్వర్తించినా, యజనిర్వహణముచేసిన బ్రాహ్మణులకు దక్షిణలు ఇచ్చినా, నీవు లేని యజము వ్యర్థము అగును" అని వరమిచ్చెను. మొగలి పువ్వు (కేతకీపుష్పము) వైపు చూసి, అసత్యము పల్కిన నీతో పూజలు ఉండకుండా ఉండు గాక అని అనగానే దేవతలు కేతకీపుష్పాన్ని దూరంగా ఉంచారు. దీనితో కలతచెందిన కేతకీపుష్పము పరమేశ్వరుడవైన నిన్ను చూసిన తరువాత కూడా అసత్య దోషము ఉండునా అని మహాదేవుడిని స్తుతించింది. దానితో ప్రీతి చెందిన శివుడు అసత్యము చెప్పిన నిన్ను ధరించడం జరగదు, కాని కేతకీ పుష్పాన్ని నా భక్తులు ధరిస్తారు.

కామధేనువుకు శాపము:

అసత్యాన్ని చెప్పిన కామధేనువును, శివుడు అసత్యమాడినందుకు, పూజకు పనికిరావని శివుడు కామధేనువుకు శాపమిచ్చాడు. తోకతో నిజం చెప్పాను కనుక క్షమించుమని కామధేనువు శివుని ప్రాధేయపడింది. భోలాశంకరుడు కనుక, కోపమును దిగమ్రింగి, "మొగముతో అసత్యమాడితివి కనుక నీ మొగము పూజనీయము కాదు, కాని సత్యమాడిన నీ పృష్ఠ భాగము పునీతమై, పూజలనందుకొనును" అని శివుడు వాక్రుచ్చెను. అప్పటి నుండి గోముఖము పూజార్హము కానిదైనది, గోమూత్రము, గోమయము, గోక్షీరములు పునీతములైనవి. పూజా, పురస్కారములలో వాడబడుచున్నవి.

మహాశివరాత్రి వ్రత కథ:

ఒకనాడు కైలాసపర్వత శిఖరముపై పార్వతీపరమేశ్వరులు సుఖాసీనులై ఉండగా పార్వతి శివునితో అన్ని వ్రతములలోను ఉత్తమమగు వ్రతమును భక్తి ముక్తి ప్రదాయకమైన దానిని తెలుపమని కోరెను. అప్పుడు శివుడు శివరాత్రి వ్రతమనుదాని విశేషాలను ఈ విధముగా, ఈ వ్రతమును మాఘబహుళచతుర్దశి నాడు ఆచరించవలెనని, తెలిసికాని, తెలియకగాని ఒక్కమారు చేసినను యముని నుండి తప్పుంచుకొని ముక్తి పొందుదురని దాని దృష్టాంతముగా ఈ క్రింది కథను వినిపించెను.

ఒకప్పుడు ఒక పర్వతప్రాంతమున హింసావృత్తిగల వ్యాధుడొకడు వుండెను. అతడు ప్రతి ఉదయం అడవికి వేటకు వెళ్ళి సాయంత్రం ఏదేని మృగమును చంపి తెచ్చుచు కుటుంబాన్ని పోషించేవాడు. కానీ ఒకనాటి ఉదయమున, అడవియంతా తిరిగినా ఒక్క మృగము కూడా దొరకలేదు. చీకటిపడుతున్నా ఉత్తచేతులతో ఇంటికి వెళ్ళడానికి మనస్కరించక వెనుతిరిగెను. దారిలో అతనికొక తటాకము కనిపించెను. ఏదైనా మృగాలు నీరు త్రాగుట కోసం అచ్చటికి తప్పకుండా వస్తాయని వేచియుండి, వాటిని చంపవచ్చునని ఆలోచించి దగ్గరనున్న ఒక చెట్టెక్కి తన చూపులకు అడ్డముగా నున్న ఆకులను, కాయలను విరిచి క్రింద పడవేయసాగెను. చలికి "శివ శివ" యని వణుకుచూ విల్లు ఎక్కిపెట్టి మృగాల కోసం వేచియుండెను. మొదటిజామున ఒక పెంటలేడి నీరు త్రాగుటకు అక్కడికి వచ్చెను. వ్యాధుడు దానిపై బాణము విడువబోగా లేడి భయపడక "వ్యాధుడా! నన్ను చంపకుము" అని మనుష్యవాక్కులతో ప్రార్థించెను. వ్యాధుడు ఆశ్చర్యపడి మనుష్యులవలె మాట్లాడు నీ సంగతి తెలుపుమని కోరెను. దానికి జింక "నేను పూర్వజన్మమున రంభయను అప్సరసను. హిరణ్యాక్షుడను రాక్షసరాజును ప్రేమించి శివుని పూజించుట మరచితిని. దానికి రుద్రుడు కోపించి కామాతురయైన నీవు, నీ ప్రియుడును జింకలుగా పన్నెండేళ్లు గడిపి ఒక వ్యాధుడు బాణముతో చంపనుండగా శాపవిముక్తులౌదురని సెలవిచ్చెను. నేను గర్భిణిని, అవధ్యను కనుక నన్ను వదలుము. మరొక పెంటజింక ఇచటికి వచ్చును. అది బాగుగా బలిసినది, కావున దానిని చంపుము. లేనిచో నేను వసతికి వెళ్ళి ప్రసవించి శిశువును బంధువుల కప్పగించి తిరిగివస్తాను" అని అతన్ని వొప్పించి వెళ్ళెను. రెండవజాము గడిచెను. మరొక పెంటజింక కనిపించెను. వ్యాధుడు సంతోషించి విల్లెక్కుపెట్టి బాణము విడువబోగా అదిచూచిన జింక భయపడి మానవవాక్కులతో "ఓ వ్యాధుడా, నేను విరహముతో కృశించియున్నాను. నాలో మేదోమాంసములు లేవు. నేను మరణించినా నీ కుటుంబానికి సరిపోను. ఇక్కడికి అత్యంత స్థూలమైన మగజింక యొకటి రాగలదు. దానిని చంపుము, కానిచో నేనే తిరిగివత్తును" అనెను. వ్యాధుడు దానిని కూడా విడిచిపెట్టెను. మూడవజాము వచ్చెను. వ్యాధుడు ఆకలితో జింక కోసం వేచియుండెను. అంతలో ఒక మగజింక అక్కడికి వచ్చెను. వింటితో బాణము విడువబోగా ఆ మృగము వ్యాధుని చూచి మొదటి రెండు పెంట జింకలు తన ప్రియురాలుల్ని తానే చంపెనా అని ప్రశ్నించెను. అందుకు వ్యాధుడు ఆశ్చర్యపడి రెండు పెంటజింకలు మరలివచ్చుటకు ప్రతిజ్ఞచేసి వెళ్ళినవి, నిన్ను నాకు ఆహారముగా పంపుతాయని చెప్పాయని అన్నాడు. ఆ మాట విని "నేను ఉదయాన్నే మీ ఇంటికి వచ్చెదను నా భార్య ఋతుమతి. ఆమెతో గడిపి బంధుమిత్రుల అనుజ్ఞపొంది మరలివత్తును అని ప్రమాణములు చేసి వెళ్ళెను. ఇట్లు నాలుగు జాములు గడిచి సూర్యోదయ సమయంలో వ్యాధుడు జింకల కొరకు ఎదురుచూచుచుండెను. కొంతసేపటికి ఆ నాలుగు జింకలును వచ్చి నన్ను మొదట చంపుము, నన్నే మొదట చంపుమని అనుచు వ్యాధుని ఎదుట మోకరిల్లెను. అతడు మృగముల సత్యనిష్టకు ఆశ్చర్యపడెను. వానిని చంపుటకు అతని మనసు ఒప్పలేదు. తన హింసావృత్తిపై జుగుప్స కలిగెను. "ఓ మృగములారా! మీ నివాసములకు వెళ్ళుము. నాకు మాంసము అక్కరలేదు. మృగములను బెదరించుట, బంధించుట, చంపుట పాపము. కుటుంబము కొరకు ఇక నేనా పాపము చేయను. ధర్మములకు దయ మూలము. సత్యఫలము. నీవు నాకు గురువు, ఉపదేష్టవు. కుటుంబ సమేతముగా నీవు వెళ్ళుము. నేనిక సత్యధర్మము నాశ్రయించి అస్త్రములను వదలిపెట్టుదును.'' అని చెప్పి ధనుర్బాణములను పారవేసి మృగములకు ప్రదక్షిణ మాచరించి నమస్కరించెను.

అంతలో ఆకాశమున దేవదుందుభులు మ్రోగెను. పుష్పవృష్టి కురిసెను. దేవదూతలు మనోహరమగు విమానమును తెచ్చి యిట్లనిరి: ఓ మహానుభావా. శివరాత్రి ప్రభావమున నీ పాతకము క్షీణించింది. ఉపవాసము, జాగరమును జరిపితివి, తెలియకయే యామ, యామమునను పూజించితివి, నీవెక్కిన్నది బిల్వవృక్షము. దానిక్రింద స్వయంభూలింగ మొకటి గుబురులో మరుగుపడి యున్నది. నీవు తెలియకయే బిల్వపత్రముల త్రుంచివేసి శివలింగాన్ని పూజించితివి. సశరీరముగా స్వర్గమునకు వెళ్ళుము. మృగరాజా! నీవు సకుటుంబముగా నక్షత్రపదము పొందుము." ఈ కథ వినిపించిన పిదప పరమేశ్వరుడు పార్వతితో నిట్లనెను: దేవీ! ఆ మృగకుటుంబమే ఆకాశమున కనిపించు మృగశిర నక్షత్రము. మూడు నక్షత్రములలో ముందున్న రెండూ జింకపిల్లలు, వెనుకనున్న మూడవది మృగి. ఈ మూడింటిని మృగశీర్ష మందురు. వాని వెనుక నుండు నక్షత్రములలో ఉజ్జ్వలమైనది లుబ్ధక నక్షత్రము.

శివరాత్రి పూజా విధానాలు:

ఆ తరువాత బ్రహ్మ, విష్ణువు ఆదిగా గల దేవతలు శివుడిని ధూపదీపాలతో అర్చించారు. దీనికి మెచ్చి శివుడు అక్కడి వారితో "మీరీనాడు చేసిన పూజకు సంతసించితిని. ఈ రోజు నుండి నేను అవతరించిన ఈ తిథి శివరాత్రి పర్వదినముగా ప్రసిద్ధి చెందుతుంది. ఈ రోజున ఉపవాసము చేసి భక్తితో నన్ను లింగ రూపముగా, సాకార రూపముగా ఎవరు అర్చిస్తారో వారికి మహాఫలము కలుగుతుంది" అని చెబుతాడు. తాను ఈ విధంగా అగ్నిలింగరూపముగా ఆవిర్భవించిన ప్రదేశము అరుణాచలముగా ప్రసిద్ధిచెంద గలదని చెబుతాడు.

జాగరణము:

జాగరణము అనగా ప్రకృతిలో నిద్రాణమైయున్న శివశక్తిని, శివపూజా, భజన లీలా శ్రవణాదులతో మేల్కొలిపి, తాను శివుడై, సర్వమును శివస్వరూపముగా భావించి, దర్శించుటయే నిజమైన జాగరణము. అప్పుడు శివపూజలో సాయుజ్యము, శివభజనలో సామీప్యము, శివభక్తులతో కూడి, శివ విషయములు ప్రసంగించుటలో సలోక్యము, శివధ్యానములో సారూప్యము సిద్ధించునని ఆదిశంకరాచార్యులు మాట ప్రత్యక్ష సత్యమగును. ఈ నాలుగింటిని శివరాత్రి నాడు ప్రత్యక్షముగా సాధించుటయే శివరాత్రి జాగరణము. జాగరణ దినమున ఉపవాసము ఉంటారు. ఈ జాగరణ సమయంలో తామున్న గృహ ఆవరణలోనో, తమ స్వంత పంటపొలాల్లోనో అక్కడి మట్టితో అక్కడే శివలింగాన్ని తయారుచేస్తూ జాముకొక శివలింగం తయారుచేసి పూజిస్తారు. ఈ రోజు, అటువంటి శాస్త్రీయ సంగీతం, నృత్యం వంటి వివిధ రంగాలలో నుండి కళాకారులు మొత్తం రాత్రి అంతా జాగారం చేస్తారు.

మహాశివరాత్రి రోజున తీసుకోవలసిన ఆహారం:

మీరు ఈ సంవత్సరం శివరాత్రి ఉపవాసం పాటించాలని ఆలోచిస్తున్నట్లయితే, ఇక్కడ కొన్ని ఆహారాలు ఉపవాసంలో ఉన్నప్పుడు మీరు తీసుకోవలసిన ఆహారం ఈ క్రింద పేర్కొనబడిన విధంగా:

బంగాళాదుంపలు, చిలకడ దుంపలు ఉడికించినవి మాత్రమే.

నాన్ ధాన్యపు వంటకాలు:

పాలు ఆధారిత పానీయాలు

పండ్లు (ఫ్రూట్ జ్యూసెస్, ఫ్రూట్ సలాడ్) మరియు పొడి పండ్లు (డ్రైఫ్రూట్స్)

మహాశివరాత్రి, శివుని రోజు, శివం... పంచభూతాత్మకం, ఆకాశం, నీరు, అగ్ని, గాలి, భూమి... పంచభూతాలు... సకల ప్రాణకోటికి జీవనాధారాలు, లైకారుడైన పరమశివుడు పంచభూత లింగస్వరూపుడై, కొలువైన పంచభూత క్షేత్రాలు భారతదేశంలోను, విదేశాలలోను ఉన్నాయి. అందుకే ఆదిశంకరుడుని భూతనాథుడని పిలుస్తారు. శివరాత్రినాడు విరూపాక్షి దేవాలయాలలో విశిష్టమైనవిగా పేరొందిన ఈ పంచభూత స్థలాల్లో ఏ శివక్షేత్రాన్ని దర్శించిన జన్మధన్యంగా భావిస్తుంది భక్తకోటి. పరిశుభ్రంగా, ఆనందంగా, సత్యం, ధర్మం, దయాదాక్షిణ్యాలు ఉన్నచోట శివుడు ఉంటాడు. శివ శక్తి లేని చోటు లేదు. కానీ, శివుడు ఒక వ్యక్తి కాదు. సృష్టి యొక్క మొత్తం విశ్వం అంతటా వ్యాపించే శక్తి. శివతత్వం అని పిలువబడే ఈ శక్తి జీవితం యొక్క చతురత, ప్రతి జీవిలో లోతుగా ఉంటుంది. మహాశివరాత్రినాడు, మనమంతా స్వచ్ఛందంగా లోతుగా (డీప్) వెళ్లి, ధ్యానం చేసి, శివశక్తిలో ఐక్యమై ఆనందిస్తూ శివతత్వాన్ని తెలుసుకుంటాము.

గత సంవత్సరం కరోనా (కోవిడ్-19) విజృంభించి, ప్రపంచవ్యాప్తంగా జనజీవనం అతలాకుతలం చేయడం, పండుగలన్నింటిని ఇంటికే పరిమితమై జరుపుకున్నాము. ఈ మహాశివరాత్రి ప్రత్యేకమైన సమయంలో, ఆత్మ వృద్ధి చెందుతున్నప్పుడు భక్తులు ఆసక్తిగా ఎదురుచూసే పగలు, రాత్రి ఉపవాసం, జాగరణము చేయుట ద్వారా, భక్తులు మానసిక ఆరోగ్యం, ఆధ్యాత్మిక సామర్థ్యాలు మెరుగుపరచుకోవడం అత్యంత అవశ్యకం ఇటువంటి విలువైన రోజుకు మరల సంవత్సరం వరకు వేచియుండవలసి వస్తుంది. కనుక ఈ మహాశివరాత్రి అనేది ఒక ప్రత్యేకమైన అవకాశం. ఈ మహాశివరాత్రి పర్వదినాన్ని పైన తెలుపబడిన విధంగా, నియమ నిష్టలతో శివుని ఆరాధించి, అర్చించి శివుని ప్రసన్నుని చేసుకోవడంద్వారా, శివుని అనుగ్రహం పొందినవారై, శాంతి, అవగాహన, దైవంతో ఏకత్వం యొక్క భావన వైపు నడిపిస్తుంది! భౌతికంగా ఆధ్యాత్మిక లక్ష్యాలను కోరుకునే భక్తులకు శివుడు అంతిమ అభయారణ్యం. ప్రపంచవ్యాప్తంగా, ప్రజలు ఓదార్పు పొందడానికి, అంతర్గత శాంతిని పొందటానికి అవకాశం. ప్రపంచం కొత్త ఆరంభాలు, మేల్కొలుపుల కోసం ఎదురుచూస్తున్నప్పుడు, 'మహాశివరాత్రి' కన్నా ప్రత్యేకమైన పండుగ రోజు ఇంకేముంటుంది. శుభప్రదమైన ప్రారంభానికి, ఆలోచనలకు ఈ శివరాత్రి భక్తులందరికీ సదవకాశం. ఆది గురువైన శివునియొక్క ప్రత్యేకతను కలిగియున్న ఈ రోజే ఏ పని ప్రారంభించినా, శుభారంభం.... శుభాకాంక్షలు, ధన్యులుకండి!

-శారద శృంగేరి,
94902 61119

ఆనాడు ప్రశ్నించిన మోడీ..నేడెందుకు మాట్లాడరు

పెట్రో,గ్యాస్ ధరలపై ఎందుకు సమాధానం ఇవ్వరు
గ్యాస్ ధరలపై బిజెపి నేతలు ఎందుకు నిలదీయరు
కెసిఆర్ మాత్రమే ప్రజాసంక్షేమానికి కట్టుబడి ఉన్నారు
టిఆర్ఎస్ ఎమ్మెల్సీలనే గెలిపించాలని తలసాని పిలుపు

హైదరాబాద్,మార్చి11(ఆర్ఎన్ఎ): గతంలో పెట్రో,గ్యాస్ ధరలపై ఆనాటి ప్రధాని మన్మోహన్‌ను విమర్శించిన ప్రధాని మోడీ ఇప్పుడు ఎందుకు ధరలు పెంచారో జవాబివ్వాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు. అభివృద్ధి, ధరలపై ప్రశ్నిస్తే మతం పేరుతో ప్రజలను బీజేపీ నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. మోదీ అధికారం చేపట్టడానికి ముందు రూ.400 ఉన్న గ్యాస్ ధర రూ.870కి పెరిగిందన్నారు. 2014 నుంచి తమ సర్కార్ ప్రజలపై ఒక్క రూపాయి కూడా పన్నుల భారం మోపలేదని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. టీఆర్ఎస్ ఓట్లకోసం.. సీట్ల కోసం పనిచేయదని.. ఏ పని చేసినా చిత్తశుద్ధితో ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుందని తెలిపారు. కరోనా వల్ల గతేడాది 1.80 లక్షల కోట్ల బ్జడెట్ ప్రవేశపెట్టుకున్నప్పటికీ.. రూ.52 వేల కోట్లు నష్టంరావడంతో సమస్యలొచ్చాయన్నారు. రాష్ట్రాలను ఆదుకోవాలని సీఎం కెసిఆర్ సూచించినా కేంద్రం పట్టించుకోలేదని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడ్డ నాటి నుంచీ మనకు కేంద్రం ఇచ్చింది సున్నా అని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు.

దేశంలో 287 కొత్త విద్యాసంస్థలు వస్తే రాష్ట్రానికి ఒక్కటంటే ఒక్కటి ఇవ్వలేదని మంత్రి విమర్శించారు. బయ్యారం ఉక్కు కర్మాగారం ఇస్తామని చెప్పి ఇవ్వక పోతున్నా... ఇక్కడి బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడ లేక పోతున్నారని ప్రశ్నించారు. ఎవరికి ఓటేస్తే.. ఎవరికి మద్దతిస్తే మంచిదో ఆలోచించాలని పట్టభద్రులను కోరారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాణీదేవి సమస్యలను పరిష్కరించే గొంతుక అవుతారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పైవేట్ విద్యాసంస్థల్లో కేజీటూపీజీ వరకు ఉన్న సమస్యలను క్షుణ్ణంగా చర్చించి త్వరగా వాటి పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి తెలిపారు. ఏపీలోని విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు కేంద్రం తీసుకొన్న నిర్ణయాన్ని తాము కూడా వ్యతిరేకిస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు కాబట్టి అవసరమైతే పోరాటానికి టిఆర్ఎస్ సిద్ధంగా ఉంటుందని అన్నారు. పోరాడి సాధించుకొన్న విశాఖ ఉక్కును వందశాతం అమ్మేసే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి జరుగుతున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వ సంస్థలను ఇక్కడ కాపాడుకుంటుంటే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా అమ్మేస్తున్నదని అన్నారు. విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్ నేతృత్వంలో శ్రమించిన విద్యుత్ ఉద్యోగులు తెలంగాణలో నిరంతర విద్యుత్ ఇవ్వడంలో పనిచేస్తున్నారని అన్నారు. ప్రాధాన్యం ఉన్న కరెంట్‌కు సీఎం కేసీఆర్ పెద్దపీట వేసి, భారీగా నిధులు కేటాయించారు. ఫలితంగా ఉత్పత్తి సామర్థ్యం 16,300 మెగావాట్లకు పెరిగిందని చెప్పారు. నేడు రాష్ట్రం దేశం లోనే అత్యధిక విద్యుత్ తలసరి వినియోగంతో ముందంజలో ఉన్నదన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎస్ వాణీదేవి అన్నివిధాలా అర్హులైన అభ్యర్థులని, వారిని గెలిపించాలని కోరారు.

ఏడుపాయలలో ఘనంగా శివరాత్రి ఉత్సవాలు

వనదుర్గామాతను దర్శించుకున్న మంత్రి హరీష్ రావు
పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేసిన మంత్రి
అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్, మదన్‌రెడ్డిలు

సంగారెడ్డి మార్చి11(నేటినిజం ప్రతినిధి): స్వరాష్ట్రంలో ఏడుపాయల వనదుర్గ భవాని క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆయన అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉత్సవాలు అంతంత మాత్రంగానే జరిగేవన్నారు. జాతర కోసం సింగూరు నుంచి 0.35 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. పోతంశెట్టిపల్లి నుంచి రూ.36కోట్లతో వంద ఫీట్ల రోడ్డును నిర్మించనున్నట్లు చెప్పారు. అమ్మవారి దయతోనే ఈ ప్రాంతం సుభిక్షమవుతుందని తెలిపారు. కాళేశ్వరం నీళ్లతో తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని, కోటి ఎకరాలు సాగవుతోం దన్నారు. కోటి ఎకరాలు సాగు చేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ చరిత్రపుటల్లోకి ఎక్కిందని అన్నారు. సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఏడుపాయలలో పోలీస్ అవుట్ పోస్ట్, ఏటీఎంలను ఏర్పాటు చేశామని, రూర్బన్ పథకం నుంచి ఏడుపాయల్లో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని సౌకర్యాలతో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఏడుపాయలలో మహాశివరాత్రి ఉత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి.

నదుర్గా అమ్మవారి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు విశిష్ట హారతితో ప్రారంభమయ్యాయి.